




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 57 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా బుధవారం 11 మార్చి 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 57 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : NTR DIST, WED 11 MARCH 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


# ‘ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్’గా ఏపీ

- ఏపీ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ ఏర్పాటుకు సన్నాహాలు
- రాబోయే పదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాలే టార్గెట్
- శ్రీకాకుళం, అనకాపల్లి, మచిలీపట్నంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదన
- రాష్ట్రంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌ను ‘ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్’గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు రాష్ట్ర తీరప్రాంతంలో లభించే విలువైన బీచ్ సాండ్ వంటి ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునివ్వాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ‘ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ (స్వా-మావీపీ)’ ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మిషన్ ద్వారా రాబోయే పదేళ్లలో రూ. 50,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు, 40,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం వనరులను వెలికితీయడమే కాకుండా, వాటికి విలువ జోడించడం (వాల్యూ ఎడిషన్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలోని వనరులపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక



ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా, రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని అధికారులు సీఎంకు వివరించారు. వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ఖనిజాలు ఉన్నట్లు తెలిపారు. ఈ బీచ్ సాండ్ మినరల్స్ నుంచి వచ్చే ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఫార్మా రంగాలతో పాటు ఏరోస్పేస్, రక్షణ, శస్త్రచికిత్స పరికరాలు, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ల విడిభాగాల తయారీ వంటి అత్యంత కీలకమైన పరిశ్రమలకు అవసరమని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలో మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో టైటానియం

మిగతా 2లో



## అది ఫేక్ ప్రచారం... వాటిని నమ్మొద్దు

- దేవాలయాల విధ్వంసంపై వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తోందన్న మంత్రి లోకేశ్
- కసాపురం ఆలయ పునర్నిర్మాణ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్
- ఆగమ సలహాదారుల ప్రకారమే పాత ఆలయాన్ని తొలగించామని వెల్లడి
- వైసీపీ పేటీయం బ్యాచ్ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ నాయకత్వంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. ఆలయాలపై దాడులు అంటూ

మిగతా 2లో

## జంట హత్యల కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి చుక్కెదురు



- గుండ్లపాడు జంట హత్యల కేసు
- బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన గురజాల కోర్టు
- కేసు తీవ్రత దృష్ట్యా బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసిన న్యాయస్థానం
- గతేడాది జరిగిన ఈ హత్యల కేసులో ఏ-7 నిందితుడిగా ఉన్న వెంకట్రామిరెడ్డి
- కోర్టు తీర్పుతో జైలులోనే కొనసాగనున్న వైసీపీ నేత

మిగతా 2లో




## ఇండిగో వరుస వైఫల్యాలు.. కంపెనీ సీఈవో రాజీనామా

**పెన్ పవర్ డెస్క్:** వరుస వైఫల్యాలతో విమానయాన రంగాన్ని ఓ కుదుపు కుదుపేసిన ఇండిగో సంస్థలో కీలక పరిణామం జరిగింది. తమ కంపెనీ సీఈవో పీటర్ ఎల్బర్స్ రాజీనామా చేసినట్లు యాజమాన్యం ప్రకటించింది. ఆయన రాజీనామా మంగళవారం (మార్చి 10) నుంచి అమలులోకి వస్తుందని వెల్లడించింది. సంస్థ నుంచి ఎల్బర్స్ తప్పుకోవడంతో.. ఆయన స్థానంలో రాహుల్ భాటియా బాధ్యతలు తీసుకోనున్నారు. మధ్యంతర సీఈవోగా భాటియాకు బాధ్యతలు అప్పగించినట్లు మేనేజ్మెంట్ ప్రకటించింది. తదుపరి ఏర్పాట్లు పూర్తయ్యేలోపు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గా కొనసాగుతారని యాజమాన్యం తెలిపింది.

**ఏంటి ఇండిగో సంక్షోభం:**

నవంబర్ 1, 2025 నుంచి పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనల రెండో దశ ఈ సంక్షోభానికి ప్రధాన మూలకారణం.

మిగతా 2లో



## వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

- 10 శాతం మేర ఉత్పత్తి పెంచాలని ఇంధన ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు
- భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయన్న కేంద్రం
- దేశానికి 70 శాతం ఉత్పత్తులు ఇతర మార్గాల్లో వస్తున్నాయన్న కేంద్రం

**పెన్ పవర్ డెస్క్:** వంటగ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వంటగ్యాస్‌ను బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో 10 శాతం మేర ఉత్పత్తిని పెంచాలని ఇంధన

మిగతా 2లో

## బీసీసీఐ, ఐసీసీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సీఎం చంద్రబాబు

- తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అమరావతిని అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశం
- సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులతో పాటు క్రీడలు, పర్యాటక రంగాలపై ప్రత్యేక దృష్టి
- పెట్టుబడుల కోసం వచ్చే సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచన
- నీరుకొండలో భారీ టూరిజం ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్దేశం
- సచివాలయం, పలు సంస్థలకు భూ కేటాయింపులకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం

**పెన్ పవర్ డెస్క్:** తెలుగు జాతి వైభవాన్ని ప్రపంచానికి చాటుతూ, భావితరాలకు ఒక గొప్ప వారసత్వ సంపదగా నిలిచేలా రాజధాని అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణంలో ఆదాయాన్ని సృష్టించే సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ భేటీలో రాజధాని అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై చర్చించి, ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాజధాని పరిధిలోని నీరుకొండ వద్ద చేపట్టే టూరిజం ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. మొత్తం 167 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్, హోటళ్లు, అమ్యూజ్‌మెంట్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా దీనిని అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని

మిగతా 2లో

# ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస...

## చొక్కాలు పట్టుకున్న కౌన్సిలర్లు



- కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం, బాహాబాహీ
- నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ డిమాండ్
- కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య తోపులాట
- చైర్‌పర్సన్ కార్యాలయం ఎదుట బైఠాయించిన బీజేపీ

మిగతా 2లో

# ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్

## మంత్రులకు కూడా జీతాలు కట్.. ప్రధాని షరీఫ్ సంచలన నిర్ణయాలు



- పశ్చిమాసియా యుద్ధంతో పాక్ అతలాకుతలం
- అత్యంత కఠినమైన పొదుపు చర్యలను ప్రకటించిన షెహబాజ్ షరీఫ్
- వారానికి నాలుగు రోజులే పని చేయనున్న ప్రభుత్వ కార్యాలయాలు

**పెన్ పవర్ డెస్క్:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ మార్కె ట్‌లో ఆయిల్ ధరల పెరుగుదల పాకిస్థాన్‌ను

మిగతా 2లో



## భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగించాడు

- సిమెంట్ ధర పెంచి ప్రజలపై రూ.165 కోట్ల భారం మోపారని విమర్శ
- జగన్ చేసిన అప్పులకు ఏటా రూ.71,800 కోట్లు చెల్లించాల్సి వస్తోందని వెల్లడి
- వైసీపీ ఐదేళ్ల పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే నిదర్శనమని వ్యాఖ్య
- కూటమి ప్రభుత్వంపై జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ధ్వజం

**పెన్ పవర్ డెస్క్:** గత ఐదేళ్ల జగన్ పాలనంతా సొంత కంపెనీలకు లబ్ధి చేకూర్చడం కోసమే సాగిందని, ముఖ్యంగా భారతి సిమెం ట్ వ్యాపారాన్ని విస్తరించడమే లక్ష్యంగా పనిచేశారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ

మిగతా 2లో

# ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

## లోక్‌సభలో ప్రియాంక గాంధీ

- లోక్‌సభలో సోదరుడిని గట్టిగా సమర్థించిన ప్రియాంక గాంధీ
- నెహ్రూను విమర్శించే బీజేపీ నేతలే ఇప్పుడు ఆయన్ను ఉటంకిస్తున్నారని చురక
- స్పీకర్ ఓం బిర్లా తొలగింపు తీర్మానంపై చర్చ సందర్భంగా ఈ వ్యాఖ్యలు



**పెన్ పవర్ డెస్క్:** లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని గట్టిగా సమర్థించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి తలవంచకుండా నిలబడిన ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని ఆమె కొనియాడారు. మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలంటూ ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చలో ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. సభకు అధ్యక్షత వహిస్తున్న ప్యానెల్ స్పీకర్ కృష్ణ ప్రసాద్ తెన్నేటి అనుమతితో ప్రియాంక మాట్లాడారు. ఈ సందర్భంగా అధికార పక్షంపై ఆమె చురకలు అంటించారు. “ప్రతిరోజూ నెహ్రూజీని విమర్శించే వారే, ఈ రోజు ఆయనను ఉటంకించడం చూసి నాకు నవ్వొచ్చింది. ఒక్కసారిగా వారికి నెహ్రూజీపై గౌరవం పుట్టుకొచ్చింది. ప్రజాస్వామ్యాన్ని అత్యంత

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# పొగతో మసకబారుతున్న బతుకులు

అత్యధిక మరణాలకు కారణంగా నిలుస్తున్న పొగ తాగడమనే దులవాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ప్రతి ఏట మార్చి మాసం 2వ బుధవారం, అనగా 11 మార్చిన "నేషనల్ నో స్మోకింగ్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఊపిరితిత్తులకు సంబంధించిన ప్రాణాంతక వ్యాధులు, శరీరంలో ప్రాణ వాయువు మోతాదులు తగ్గడం, బిపీ/స్ట్రోక్ లాంటి హృద్రోగాలకు దారి తీస్తున్న పొగ తాగడమనే దురలవాటు బారిన పడిన మిలియన్ల ప్రజలు మరణం అంచున తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకోవడం, కుటుంబాలు ఆర్థిక సమస్యలను ఎదుర్కోవడం, కుటుంబ సభ్యులు అనాధలుగా మారడం లాంటి ప్రతికూలతలు పొగరాయుళ్లను వెంటాడుతున్నాయి. పొగ తాగడాన్ని క్రమంగా తగ్గించడంతో ఫలితంగా సత్వరమే బిపీ, ఊపిరితిత్తులు, గుండె స్పందనలు మెరుగవుతాయి. పొగ మానేస్తే శరీరంలో ప్రమాదకర కార్బన్ మోనాక్సైడ్ పరిమాణం తగ్గుతూ ఆరోగ్య పునరుద్ధరణకు బాటలు పడతాయి. పొగ తాగడమనే దురలవాటు తీవ్ర ప్రభావాలను దృష్టిలో పెట్టుకొన్న ప్రపంచ పౌర సమాజం 1984 నుంచి ప్రతి ఏట 2వ బుధవారం రోజున విశ్వవ్యాప్తంగా "నేషనల్ నో స్మోకింగ్ డే" పాటించడం కొనసాగుతున్నది. పొగను వదిలితే ఆరోగ్యం మెరుగవుతుందనే నినాదాన్ని క్రిందటి స్థాయి వరకు ప్రచారం చేయడం నేటి అవసరంగా భావించాలి. ప్రత్యక్షంగా పొగ తాగడంతో పాటు పొగరాయుళ్లతో పాటు వారు వదిలే పొగను పీల్చే సెకండ్ హాండ్ స్మోకర్స్ కూడా పొగ తాగినట్లుగా, అనారోగ్యం పాలు అవుతారని భావించాలి. పొగ తాగడం ప్రాణాంతకం కావడంతో బహిరంగ ప్రదేశాల్లో స్మోకింగ్ నిషేధం విధించబడడం సముచిత నిర్ణయంగా కొనియాడాలి. పొగ తాగడంవల్ల ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ సంభావ్యత పెరుగుతుందని పొగరాయుళ్లు గమనించాలి. పొగ తాగడం వల్ల జీర్ణనాళం, మూత్రపిండాలు, కాలేయం, యూరినరీ బ్లాడర్ లాంటి ప్రధాన అవయవాలు కూడా దెబ్బతినడం ఖాయమని తేలింది. 2026 నేషనల్ నో స్మోకింగ్ డే ఇతివృత్తంగా "అన్‌మాస్కింగ్ ది అప్పీల్ : కౌంటరింగ్ నికోటిన్ అండ్ టొబాకో అడిక్షన్" లేదా "విజ్ఞప్తులను చేద్దాం : నికోటిన్, పొగాకు దురలవాటును వ్యతిరేకిద్దాం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. పొగ తాగడమనే దురలవాటు వల్ల వ్యక్తి జీవితకాలం కనీసం 10 ఏండ్లు తగ్గుతుందని తేలడం ప్రమాద హెచ్చరికగా భావించాలి. స్టైల్‌గా పొగ పీల్చడం వల్ల అనారోగ్యాలు, ఆర్థిక భారం, ఆసుపత్రి బిల్లులు, సమాజంలో చెడు పేరు, కుటుంబాల్లో చీకట్లతో పాటు చివరికి అకాల మరణం లాంటివి ఉచితంగా వస్తాయని పొగరాయుళ్లు బుద్ధి తెచ్చుకోవాలి. పొగ తాగడం వల్ల చికాకు లేదా ఇర్రిటేషన్, పొగ పట్ల తీవ్రమైన కోరిక, చంచలత్వం, నిద్రలేమి లాంటి రోగ లక్షణాలు బయట పడడం, తర్వాత తీవ్రమైన ఊపిరితిత్తులు, హృద్రోగాలు, శ్వాస క్రియ రోగాలకు దారి తీస్తుంది. "పొగకు స్వస్తి పలుకుదాం – కొత్త జీవితాలను ప్రారంభిద్దాం" అంటూ శారీరక మానసిక ఆరోగ్యాలను ఆహ్వానిస్తూ, తన కోసమే కాదు తనను నమ్మిన వారి కోసం ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకుందాం. మన ప్రాణాలు తీయక ముందే మనమే పొగకు విడాకులిద్దాం. పొగకు లొంగకుండా మన జీవితాలను సుసంపన్నం చేసుకుందాం. పొగ దురలవాటు డబ్బుతో ముడిపడింది కాదని, కుటుంబ జీవితాలతో సంబంధాన్ని పెనవేసుకుందని తెలుసుకోవాలి. పొగను వదిలితే నీ ఆరోగ్యంతో పాటు పర్యావరణ ఆరోగ్యం కూడా దెబ్బ తింటుందని మరువరాదు. తమ బతుకులు పొగసూరక ముందే బుద్ధి తెచ్చుకొని పొగకు 'నో' చెబుదాం, ఆరోగ్యకర జీవితానికి 'ఎస్' చెబుదాం.

# వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

- మొదటి పేజి తరువాయి

ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఇంధన ఉత్పత్తిపై ఆందోళనలు రేకెత్తుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక భేటీ నిర్వహించారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. ఎల్పీజీ నిల్వలు, సరఫరాపై సమీక్ష జరిపారు. కాగా ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కేంద్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. కమర్షియల్ ఎల్పీజీ వాస్తవ అవసరాలను గ్యాస్ కంపెనీలు అందుకోవాల్సిందేనని ఇంధన కంపెనీలకు స్పష్టం చేసింది. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో కొంత సంక్షోభం వాస్తవమే కానీ పెట్రోలియం ఉత్పత్తుల ప్రస్తుతానికి ఇబ్బంది లేదని కేంద్రం తెలిపింది. పశ్చిమాసియాలో యుద్ధానికి ముందు తరహాలోనే భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. దేశానికి వచ్చే 70 శాతం ఉత్పత్తులు హోర్ముజ్ జలసంధి నుంచి కాకుండా ఇతర మార్గాల్లో వస్తున్నట్లు కేంద్రం తెలిపింది.

# బీసీసీఐ, ఐసీసీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

అన్నారు. భవిష్యత్తులో క్రీడా రంగం అతిపెద్ద ఆదాయ వనరుగా మారబోతోందని చంద్రబాబు విశ్లేషించారు. ఒకప్పుడు నిధుల కోసం ఎదురుచూసిన బీసీసీఐ, ఐసీసీ వంటి క్రికెట్ బోర్డులు ఇప్పుడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఎలా ఎదిగాయో గమనించాలని అన్నారు. ఇదే తరహాలో ఇతర క్రీడలు కూడా వాణిజ్యపరంగా మారే అవకాశాలను అందిపుచ్చుకోవాలని, అమరావతిలో నిర్మించే స్పోర్ట్స్ సిటీ మాస్టర్ ప్లాన్ ఈ దిశగా ఉండాలని తెలిపారు. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు పలు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని, వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఉండాలని చంద్రబాబు అన్నారు. "గతంలో ఉమ్మడి రాష్ట్రంలో మా ప్రభుత్వ హయాంలో సైబర్ సిటీలో పెట్టుబడులు పెట్టలేకపోయినందుకు డీఎల్‌ఎఫ్ వంటి సంస్థలు ఇప్పుడు బాధపడుతున్నాయి. అమరావతిలో ఆ అవకాశాన్ని వదులుకోకూడదని భావిస్తున్నాయి. ఇది మన ప్రభుత్వానికి ఉన్న విశ్వసనీయత. ఈ బ్రాండ్‌ను మరింతగా పెంచాలి" అని సూచించారు. ఓవైపు రాజధానిలో పనులను వేగవంతం చేస్తూనే, మరోవైపు పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రక్రియ కొనసాగాలని స్పష్టం చేశారు. అమరావతిలో నిర్మించబోయే తెలుగు కల్చరల్ సెంటర్‌కు మంచి పేరును పరిశీలించాలని, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక పెద్ద కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**సీఆర్డీఏ అథారిటీ ఆమోదాలు**

ఈ సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు అథారిటీ ఆమోదముద్ర వేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కార్యాలయానికి 80 సెంట్ల భూమి, పరిహారంగా తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు, పంచాయితీరాజ్ పరిధిలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల భూమి కేటాయింపులకు ఆమోదం లభించింది.

వీటితో పాటు ఏపీ సచివాలయం, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2,316 కోట్లకు, రూ.119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు.

ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్

- మొదటి పేజి తరువాయి

ఊపిరాడనీ యకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడుల ప్రభావంతో చమురు దిగుమతులు ప్రియమవ్వడంతో, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రధాని షెహబాజ్ షరీఫ్ అత్యంత కఠినమైన పొదుపు చర్యలు ప్రకటించారు. గల్ఫ్ దేశాల నుంచి వచ్చే చమురు సరఫరాపైనే తమ దేశం ఆధారపడి ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఖర్చులను తగ్గించుకోక తప్పదని ఆయన స్పష్టం చేశారు. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు ఇకపై వారానికి నాలుగు రోజులు (సోమవారం నుంచి గురువారం వరకు) మాత్రమే పనిచేస్తాయి. అయితే బ్యాంకులు, ఆసుపత్రులు, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ఈ నిబంధన వర్తించదు. వచ్చే రెండు వారాల పాటు స్కూళ్లు, కాలేజీలు మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఉన్నత విద్యా సంస్థలు తరగతులను ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, అధికారిక వాహనాలకు ఇచ్చే పెట్రోల్ కోటాను 50 శాతానికి తగ్గించారు. అలాగే రాబోయే రెండు వారాల పాటు 60 శాతం ప్రభుత్వ వాహనాలను రోడ్డెక్కించబోమని ప్రధాని తెలిపారు. అంబులెన్స్‌లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు దీని నుంచి మినహాయింపు ఇచ్చారు.

మంత్రులు, సలహాదారులు రాబోయే రెండు నెలల పాటు ఎటువంటి జీతాలు తీసుకోరు. పార్లమెంటు సభ్యులందరికీ 25 శాతం, రూ. 3 లక్షల కంటే ఎక్కువ సంపాదించే ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం

జీతాల్లో కోత విధించారు. ప్రధాని, ముఖ్యమంత్రులు, గవర్నర్లు సహా అందరు ప్రజాప్రతినిధులు, అధికారుల విదేశీ పర్యటనలపై పూర్తి నిషేధం విధించారు. కేవలం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అనుమతి ఉంటుంది.

# ఇండిగో వరుస వైఫల్యాలు.. కంపెనీ సీఈవో రాజీనామా

- మొదటి పేజి తరువాయి

ఈ నిబంధనలు పైలట్‌ల వారపు విశ్రాంతి సమయాన్ని 36 గంటల నుంచి 48 గంటలకు పెంచాయి. ఇది పైలట్‌ల అలసట రిస్క్‌ను తగ్గిస్తుంది. ఈ మార్పులు విమాన ప్రయాణాల భద్రతను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగుపరచాలని లక్ష్యంగా చేసిన ప్రయత్నం. ఈ నిబంధనల గురించి రెండు సంవత్సరాల ముందు నుంచే పూర్తి అవగాహన ఉన్నప్పటికీ, కొత్త నిబంధనలకు అనుగుణంగా తగినంత మంది సిబ్బందిని సమకూర్చుకోవడంతోపాటు రోస్టరింగ్ వ్యవస్థను మెరుగుపరచడంలో ఇండిగో నిర్లక్ష్యం వహించింది. భారతదేశంలో అత్యధిక విమానాలను నడుపుతున్న సంస్థగా, సిబ్బంది కొరతను సరిచేయడానికి ఇండిగో ప్రణాళికా లోపం సంస్థ కార్యకలాపాలను ఒక్కసారిగా కుప్పకూల్చింది.

**డీజీసీఏ వైఫల్యం**

దేశ పౌర విమానయాన భద్రతకు అత్యున్నత బాధ్యత వహించే డీజీసీఏ చర్యలు ఈ సంక్షోభంలో అసమర్థతను చూపించిందని నిపుణులు విమర్శిస్తున్నారు. డీజీసీఏ, ఇండిగోకు షోకాజ్ నోటీసు ఇవ్వడం న్యాయపరమైన చర్య అయినప్పటికీ, వేలాది విమానాలు రద్దై, ప్రయాణీకులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన తర్వాత మాత్రమే డీజీసీఏ స్పందించింది.

ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్1937 ప్రకారం డీజీసీఏ సంస్థకు విమానయాన ఆపరేటర్‌పై భారీ జరిమానాలు విధించే అధికారం లేదా ఎయిర్ ఆపరేటర్స్ పర్మిట్ రద్దు చేసే అధికారం ఉంది. ఈ జాప్యం డీజీసీఏ వ్యవస్థాపరమైన పర్యవేక్షణ వైఫల్యాన్ని తెలియజేస్తుంది. ముందస్తు తనిఖీ చేయడంలో విఫలమవడం, డీజీసీఏ తన ప్రాథమిక భద్రతా విధులను పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్టేనని విమర్శలు వచ్చాయి.

**ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం**

దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో చట్టపరమైన బాధ్యతతో పాటు నైతిక బాధ్యత వహించాలి. నిబంధనల అమలుకు తగిన ఏర్పాట్లు చేయడంలో విఫలమవడం అనేది కేవలం నిర్వహణ లోపం కాదు. ఇది 'ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం'గా పరిగణించవచ్చు. ఎందుకంటే, తమ అధిక లాభాలను కాపాడుకోవడానికి, ఇండిగో భద్రతా నిబంధనల అమలును ఆలస్యం చేసిందని, తద్వారా సంస్థ విమానయాన చట్టాలను ఉల్లంఘించిందని స్పష్టం చేస్తోంది. న్యాయ పదజాలంలో 'రెస్ ఇప్సా లోక్విటూర్' అనే సూత్రం ఇక్కడ వర్తిస్తుంది. అంటే, నష్టం జరగడానికి సంస్థ నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా తెలుస్తోంది. ఈ నిబంధనల ఉల్లంఘన విమానయాన చట్టాల క్రింద ఇండిగో విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీసింది.

డీజీసీఏ సీఏఆర్? (పౌర విమానయాన అవసరాలు) సెక్షన్ 3, సిరీస్ ఎం, పార్ట్ ×ა అనేది విమాన ప్రయాణానికి నిరాకరించినప్పుడు, విమానాలు రద్దు అయినప్పుడు, ఆలస్యం అయినప్పుడు ప్రయాణీకులకు విమానయాన సంస్థలు అందించవలసిన సౌకర్యాలు, పరిహారం గురించిన నియమావళి ప్రకారం అందించాల్సిన నష్టపరిహారం, రిఫండ్‌లతో పాటు ఇతర సౌకర్యాలను సకాలంలో అందించడంలో కూడా ఇండిగో వైఫల్యం చెందింది. ఈ వైఫల్యం కారణంగా ఇండిగో కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019 కింద 'సేవా లోపం'కు పూర్తి బాధ్యత వహించాలి.

# భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగించాడు

- మొదటి పేజి తరువాయి

మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో విమర్శించారు. సిమెంట్ ధరను కృత్రిమంగా పెంచి ప్రజాధనాన్ని తన కంపెనీకి మళ్లించారని, అదే సమయంలో తన మీడియా సంస్థ అయిన సాక్షికి వందల కోట్ల రూపాయల ప్రకటనలు ఇచ్చుకున్నారని ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

**భారతి సిమెంట్‌కు రూ.165 కోట్ల లబ్ధి**

జగన్ తన అధికారాన్ని పూర్తిగా దుర్వినియోగం చేశారని పార్థసారథి ధ్వజమెత్తారు. "రాష్ట్రానికి ఆదాయం తెచ్చే మార్గాలను గాలికొదిలేసిన జగన్, తన కంపెనీల ఆదాయానికి మాత్రం ఎలాంటి లోటు రాకుండా చూసుకున్నారు. భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చేందుకు సిమెంట్ బస్తాపై రూ.3 పెంచి, ప్రజలపై ఏకంగా రూ.165 కోట్ల భారం మోపారు. ఈ నిర్ణయంతో భారతి సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం మూడు రెట్లు పెరిగింది. మరోవైపు, సాక్షి పత్రికకు ప్రకటనల రూపంలో రూ.400 కోట్లకు పైగా కట్టబెట్టారు. ప్రత్యేక జీవోలు జారీ చేసి వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో బలవంతంగా సాక్షి పత్రికను కొనిపించారు. దీన్నిబట్టి ఆయన పాలన ఎవరి కోసం సాగిందో స్పష్టమవుతోంది" అని పార్థసారథి విమర్శించారు.

**ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యం**

జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, ఆయన సృష్టించిన ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో రాష్ట్రం మొత్తం రూ.9.70 లక్షల కోట్ల అప్పు చేసిందని, ఈ అప్పులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏటా రూ.71,800 కోట్లు అసలు, వడ్డీల రూపంలో చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

"ఇప్పుడు అసెంబ్లీకి రాకుండా ఇంట్లో కూర్చుని, కూటమి ప్రభుత్వంపై జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.87 వేల కోట్లు అప్పు చేసిందని దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ కాగ్ నివేదిక ప్రకారం ఆ ఏడాదిలో మొత్తం అప్పు రూ.81 వేల కోట్లు. అందులో తొలి మూడు నెలలు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వమే రూ.27,025 కోట్లు అప్పు చేసింది. ఆ తర్వాత తొమ్మిది నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.53 వేల కోట్లు మాత్రమే అప్పు చేసింది. జగన్ చేసిన అప్పులతో ఆస్తులు సృష్టించలేదు, కానీ మేం మూలధన వ్యయం కింద రూ.16 వేల కోట్లు ఖర్చుచేసి భవిష్యత్ తరాలకు ఆస్తులను అందిస్తున్నాం" అని పార్థసారథి వివరించారు.

**సంక్షేమం, అభివృద్ధిలో ముందున్నాం**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాల అమలులో రాజీ పడటం లేదని మంత్రి తెలిపారు. "జగన్ హయాంలో ఐదేళ్లలో అమ్మ ఒడికి రూ.26 వేల కోట్లు ఖర్చు చేస్తే, మా ప్రభుత్వం ఐదేళ్లలో రూ.35 వేల కోట్లు ఖర్చు చేయనుంది. సామాజిక పింఛన్లకు జగన్ రూ.58,500 కోట్లు ఖర్చు చేస్తే, మేం కేవలం 20 నెలల్లోనే రూ.58,654 కోట్లు చెల్లించాం. చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో రాష్ట్రంలో మళ్లీ విశ్వసనీయత పెరిగింది. జగన్ పాలనలో వెళ్లిపోయిన కంపెనీలు తిరిగి పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. ఇప్పటికే 20 పారిశ్రామిక పాలసీలు తీసుకొచ్చి, 20 నెలల్లో రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. తద్వారా 6.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం. ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. అన్నం పెట్టే రైతులను సైతం జగన్ మోసం చేశారని, ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.1600 కోట్లు చెల్లించకుండా వెళ్ళిపోయారని పార్థసారథి మండిపడ్డారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోందని తెలిపారు. పోలవరం, అమరావతి వంటి కీలక ప్రాజెక్టులను నాశనం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను పక్కదారి పట్టించి రాష్ట్రాన్ని ఐదేళ్లు వెనక్కి నెట్టిన జగన్, ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టాలని చూడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

# జంట హత్యల కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి చుక్కెదురు

పల్నాడు జిల్లా గుండ్లపాడులో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ నేత పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి న్యాయస్థానంలో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను గురజాల కోర్టు సోమవారం కొట్టివేసింది. కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేయలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. గతేడాది గుండ్లపాడుకు చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావు హత్యకు గురయ్యారు. తెలంగాణలోని హుజూర్‌నగర్‌లో ఒక వివాహానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా, వెల్దుర్తి మండలం బొదిలవీడు సమీపంలో వారిని వాహనంతో ఢీకొట్టి హతమార్చారు. ఈ హత్యల వెనుక పిన్నెల్లి సోదరుల ప్రమేయం ఉందని ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఏ–7 నిందితుడిగా ఉన్నారు. ఆయన తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన గురజాల కోర్టు, కేసు పూర్వాపరాలను, గాంభీర్యాన్ని దృష్టిలో ఉంచుకొని బెయిల్‌ను తిరస్కరించింది. తాజా తీర్పుతో వెంకట్రామిరెడ్డి జైలులోనే కొనసాగనున్నారు.

# ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస...

ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం రసాభాసగా మారింది. కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. రెండు పార్టీల కౌన్సిలర్లు పరస్పరం చొక్కాలు పట్టుకుని, బాహాబాహీకి దిగారు. ఇరు పార్టీల గందరగోళం మధ్యనే ఛైర్‌పర్సన్ అనూష 'అజెండా పాస్' అంటూ ప్రకటన చేసి తన ఛాంబర్‌లోకి వెళ్లిపోయారు. అయితే చర్చ లేకుండానే అజెండాను ఎలా పాస్ చేస్తారని బీజేపీ కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ ఛాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఛైర్‌పర్సన్, కాంగ్రెస్ కౌన్సిలర్లు బయటకు రాకుండా బీజేపీ కౌన్సిలర్లు అడ్డుకున్నారు. పోలీసులు జోక్యంతో ఛైర్‌పర్సన్ బయటకు వచ్చారు. దీంతో దాదాపు మూడు గంటల పాటు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కాగా, నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేయడం ఉద్రిక్తతకు దారి తీసింది. కాంగ్రెస్ కౌన్సిలర్ అజయ్, బీజేపీ కౌన్సిలర్ రాకేష్ మధ్య తోపులాట చోటు చేసుకుంది. పాలకవర్గం సభను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

# అది ఫేక్ ప్రచారం... వాటిని నమ్మొద్దు

- మొదటి పేజి తరువాయి

అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాల విధ్వంసం జరుగుతున్నట్లు వైసీపీ ఫేక్ ముఠా ప్రచారం చేస్తోంది... ఇందులో ఎలాంటి వాస్తవం లేదు... వీటిని నమ్మొద్దు... ప్రజల మధ్య కులం, మతం, ప్రాంతం పేరుతో అలజడి రేపేందుకు యత్నిస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణం సందర్భంగా తీసిన వీడియోలతో ఫేక్ ప్రచారం చేస్తున్నారు. దేవాలయ గర్భాలయం, విమానగోపురం, అర్థ మండపం రాతి నిర్మాణపు పనులు 60 శాతం పూర్తయ్యాయి. దేవస్థానం వైదిక కమిటీ సభ్యుల తీర్మానం ప్రకారం, ఆగమ సలహాదారుల సూచనల మేరకు ఫిబ్రవరి 28న శాస్త్రోక్తంగా పాత ఆలయాన్ని తొలగించారు. ఫేక్ ప్రచారం చేస్తున్న వైసీపీ పేటియం బ్యాచ్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలు నిజానిజాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అంటూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

# ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

- మొదటి పేజి తరువాయి

బలోపేతం చేసింది నెహ్రూజీనే అని ఇప్పుడు చెబుతున్నారు" అని ప్రియాంక వ్యాఖ్యానించగా, ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరుస్తూ మద్దతు తెలిపారు. అనంతరం రాహుల్ గాంధీని సమర్థిస్తూ, "గత 12 ఏళ్లుగా ఈ ప్రభుత్వం ముందు తలవంచని వ్యక్తి ఈ దేశంలో ఒక్కరే ఉన్నారు. ఆయనే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. ఎందుకంటే లోక్‌సభ నాయకుడు నిజం మాట్లాడటానికి వెనుకాడరు. కానీ, వారు (ప్రభుత్వం) నిజాన్ని జీర్ణించుకోలేరు" అని ప్రియాంక అన్నారు. అంతకుముందు, స్పీకర్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు స్పందించారు. రాజ్యాంగం ప్రకారం చట్టాలు, నిబంధనలకు అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ కట్టుబడి ఉండాలని అన్నారు. "ఏ వ్యక్తి అయినా తనను తాను అన్నింటికీ అతీతుడిగా భావించినప్పుడు, అతడిని నిలదీయడం చాలా ముఖ్యం" అని రాహుల్ గాంధీని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

# 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ

- మొదటి పేజి తరువాయి

పార్క్ (ఏడాదికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం), అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్ (ఏడాదికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం), మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలని తమ ప్రతిపాదనలను సీఎం ముందుంచారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గనులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# అర్బన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి





చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 10 : చిలకలూరిపేట : గుంటూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీ) సర్వశ్రేష్ఠ త్రిపాఠి మంగళవారం చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలలో భాగంగా స్టేషన్‌కు వచ్చిన ఆయన స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్టేషన్ ప్రాంగణం, ఆయుధాగారం, రికార్డు గదులను పరిశీలిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిస్థితి సంతృప్తికరంగా ఉన్నప్పటికీ నేరాల నియంత్రణలో పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పోలీసులకు ఎదురవుతున్న సిబ్బంది కొరతతో పాటు ఇతర సమస్యలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. వాటి పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ నేరాల నియంత్రణకు కట్టుబడి పనిచేయాలని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సిబ్బందిని ఆదేశించారు.

# యడ్లపాడు మండల సమాఖ్యలో జెండర్ శిక్షణ కార్యక్రమం



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 10 : యడ్లపాడు: యడ్లపాడు మండల స్థానిక సమాఖ్యలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆర్. నాగలక్ష్మి అధ్యక్షతన జెండర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో జెండర్ ప్రతిజ్ఞ చేయించి లింగ వివక్షతపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలపై సమాజంలో జరుగుతున్న హింస, మహిళా హక్కులు మరియు చట్టాల గురించి పాల్గొన్న వారికి వివరించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి మాట్లాడుతూ మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన అవసరమని తెలిపారు. హెల్ప్‌లైన్ నంబర్ 181కు కాల్ చేస్తే పోలీసులు స్పందించి కేసు నమోదు చేస్తారని చెప్పారు. అలాగే చైల్డ్ మ్యారేజ్ యాక్ట్--2006 గురించి వివరించి బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ సంఘాల సభ్యులు జెండర్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. కుటుంబంలో మహిళల పాత్రను గౌరవించాలనే అంశంపై కూడా చర్చించారు. యడ్లపాడు మండలంలోని అన్ని గ్రామ సంఘాల్లో జెండర్ అజెండాను పెట్టి చర్చలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆర్. నాగలక్ష్మి, సెక్రటరీ శ్రీలక్ష్మి, అమాసమ్మ, ఏపీహెచ్‌కే రవీంద్రకుమార్, సీసీలు వై. పెద్దయ్య, సిహెచ్. నాగేశ్వరరావు, జి. నాగేశ్వరరావు, హెచ్. ద్రాక్షాయమ, ఎం.ఎస్.ఏ. ఫిలిప్ కుమార్, వివిధ గ్రామాల వీఓలు, గ్రామ సంఘాల అధ్యక్షులు, జెండర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మన వార్డు మన ఎమ్మెల్యే నిర్వహించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ





పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 10: బాపట్ల పట్టణ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించే లక్ష్యంతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన వార్డు మన ఎమ్మెల్యే' కార్యక్రమం మంగళవారం పునఃప్రారంభమైంది. తమ వార్డుకు స్వయంగా విచ్చేసిన ఎమ్మెల్యే కి ప్రజలు హారతులతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమలో భాగంగా 5వ రోజు బాపట్ల పట్టణంలోని రైలుపేట 4వ వార్డులో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు గల్లీ గల్లీ తిరుగుతూ ప్రజలతో మమేకమైన వారి రోజువారీ ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు మరియు సిమెంట్ రోడ్ల మరమ్మతులపై ప్రజలు ఎమ్మెల్యే కి విన్నవించారు. ప్రజల విన్నపాలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, పర్యటనలో ఉన్న మున్సిపల్ అధికారులను పిలిచి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, ప్రాధాన్యత క్రమంలో తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆశయాల మేరకు, ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే చేర్చడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. వారంలో ప్రతి మంగళవారం ఒక వార్డు చొప్పున పర్యటించి, పట్టణంలోని ప్రతి సమస్యను పరిష్కరించే వరకు విశ్రమించబోమని స్పష్టం చేశారు. కేవలం హామీలకే పరిమితం కాకుండా, చేతల్లో అభివృద్ధిని చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి,పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, యూనిట్ ఇన్ ఛార్జ్ పరిశా రమేష్ గౌడ్, వార్డ్ ప్రెసిడెంట్ అద్దంకి సోమ శేఖర్, మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రంజాన్ సందర్భంగా మౌజాన్, ఇమామ్‌లకు రంజాన్ తోఫా పంపిణీ చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి...





పెన్ పవర్, గుంటూరు, మార్చి, 10. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో పట్టాభిపురం మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాది ఖానాలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 55 మసీదుల మౌజాన్‌లు, ఇమామ్‌లకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతుల మీదుగా మౌజాన్‌లు, ఇమామ్‌లకు బట్టలు మరియు అవసరమైన సరుకులను అందజేశారు. ముస్లిం సోదరుల అంత్యక్రియల సమయంలో ఇబ్బంది లేకుండా ఉండటానికి ఒక జనాజా వాహనాన్ని ఇస్తున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...రంజాన్ వంటి పవిత్ర మాసంలో అల్లాహ్ సేవలో నిత్యం గడిపే మౌజాన్‌లు, ఇమామ్‌లకు సహాయం చేయడం ఎంతో సంతోషకరమని, పశ్చిమ నియోజకవర్గ ప్రజలందరి అభివృద్ధి కోసం తాను రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజల ఆశీస్సులతోనే ఈ స్థాయికి చేరుకున్నానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మతభేదాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండడమే నిజమైన ఆనందం, శాంతి అని ప్రతి మతం బోధిస్తుందని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు తమ సమస్యలుగా ఖబరస్థాన్, మసీదు మరియు విద్యాసంస్థల అవసరాలను తన దృష్టికి తీసుకువచ్చారని, వాటి పరిష్కారం కోసం అధికారులు, కమిషనర్, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ మరియు ఇతర అధికారులతో చర్చలు జరుపుతున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. త్వరలోనే ఖబరస్థాన్ కోసం తగిన స్థలాన్ని గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. అలాగే 28వ డివిజన్‌లో ఆడపిల్లల కోసం స్కూల్ ఏర్పాటు చేసే దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెల్లడించారు. రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందులు కాకుండా ముస్లిం సోదరుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని జనాజా వాహనం (వైకుంఠ రథం) ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. రానున్న వారం రోజుల్లోనే ఆ జనాజా వాహనాన్ని అందజేస్తామని, దీనిని నిర్వహించేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ఎండీ గళ్ళా రామచంద్రరావు మాట్లాడుతూ...ముస్లిం సమాజంతో తమకు చిన్ననాటి నుంచే అనుబంధం ఉందని, ఎన్నికల సమయంలో ముస్లిం సోదరులతో ఏర్పడిన అనుబంధం ద్వారా వారి విద్య, వైద్య రంగాలలో ఉన్న అవసరాలు తెలుసుకున్నామని తెలిపారు. ఉర్దూ మాధ్యమంలో ఒక స్కూల్ ఏర్పాటు చేయాలనే సంకల్పంతో మైనారిటీ నాయకులతో కలిసి సరైన స్థలం ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అదే విధంగా శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ సంస్థ తరపున జనాజా వాహనాన్ని వారం రోజుల్లో అందజేస్తామని ప్రకటించారు. మైనారిటీలు విద్యాపరంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన కార్యక్రమాలు చేపడతామని, పశ్చిమ నియోజకవర్గంలోమైనారిటీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడిఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పఠాన్. అస్మతుల్లా, షేక్. అబ్దుల్ రహీమ్, షేక్. రఫీ, షేక్. ఖాదర్ బుడే, షేక్. రఫీ, స్థానిక కార్పొరేటర్ ఈరంటి వర ప్రసాద్, షేక్. నజీర్, షేక్. బాజి, షేక్ లాల్ వజీర్, షేక్. సుబాని, షేక్. రుస్తుం బాబు, షేక్. ఇమ్రాన్ , షేక్ బిడింగ్ సుభాని, షేక్. మస్తాన్ వలి, షేక్. గౌస్, షేక్‌బాషా, షేక్ మీరా వలి , షేక్. కరీం, షేక్ హుస్సేన్ , షేక్. అన్వర్, షేక్. ఈశావలి, షేక్. గౌసుల, షేక్. రషీద్, షేక్. ఆదమ్, షేక్. రబ్బానీ, మరియు మైనారిటీ నాయకులు, ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, మహిళా నాయకులు మరియు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుంటూరు...నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు....








పెన్ పవర్, గుంటూరు, మార్చి, 10. రెండు రోజుల పాటు తనిఖీలు కొనసాగిస్తామన్న ఏ ఎస్పీ.మహేంద్ర మతే. గుంటూరు...మునిసిపల్ కార్యాలయంలో పిర్యాదు ల మేరకు తనిఖీలు చేస్తున్నాం రెండు రోజుల పాటు చేస్తాం తనిఖీలు చేస్తున్నాం ప్రాథమిక విచారణలో ఉంది.. పలువూరు అధికారులను విచారణ చేస్తున్న ఏసీబీ అధికారులు కీలక పత్రాలు.రికార్డులు పరిశీలన....

# అవయవ దాన నమోదు శిబిరం



పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి10: జిల్లా శరీర,అవయవ దాన సంఘ ఆధ్వర్యంలో ఈ నెల 12 వ తేదీన స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో 'అవయవ దాన అవగాహన మరియు నమోదు శిబిరం' జరుగుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ చెప్పారు. శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆమె మంగళవారం ఆవిష్కరించారు. బ్రెయిన్ డెడ్ సందర్భంలోనే దాతల అవయవాలను తీసుకొని, అవసరమైన వారికి వినియోగించడం జరుగుతుందని ఆమె వివరించారు. దాతలు తమ ఆధార్ కార్డు వివరాలతో ఈ శిబిరంలో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు, వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ కే సిద్ధార్థ, కార్యదర్శి డా పిసి సాయిబాబు, సభ్యులు కె. అనిల్ కుమార్. పి ప్రసాదరావు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నివారణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ




భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 10: ,వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నందు ప్రభుత్వం ఉచితంగా 14 సంవత్సరాల నుండి 15 సంవత్సరముల ఆడపిల్లలకు హెచ్ పివి సర్వైకల్ క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ ను మంగళవారం వేశారు. ఈ సందర్భంగాఎంపీపీ మాట్లాడుతూ బాలికల గర్భాశయం లో క్యాన్సర్ రాకుండా ముందు జాగ్రత్తగాఈ వ్యాక్సిన్ వేస్తే రాకుండా నివారించవచ్చునని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మోహసీనా తాజ్, వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అబ్రహం లింకన్, పవన్ చైతన్య లు మాట్లాడుతూ భట్టిప్రోలు పరిధిలో 13 పిహెచ్సిలో 32 మంది కి ఈ వ్యాక్సిన్ వేయడం జరిగిందని ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు.ఒకవేళ జ్వరం వచ్చిన భయపడాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వం వారు ఉచితంగా అందించే ఈ వ్యాక్సిన్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి



భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చ్, 10: భట్టిప్రోలు మండలం, మండల పరిషత్ కార్యాలయం నందు మంగళవారం సావిత్రి బాయి పూలే వర్ధంతి ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్య క్రమమునుకు ఎంపీపీ లలిత కుమారి హాజరయ్యారు.ఆమె మాట్లా డుతూ తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘ సంస్కర్త, రచయిత్రి, మహిళలకు స్ఫూర్తి ప్రదాత అయిన సావిత్రిబాయి పూలే అని,ఆమెకు నివాళులు అర్పించినారు. ఎంపీడీవో ఎస్. వెంకట రమణ మాట్లాడుతూ ఆమె ఎంతో మంది మహిళలను విద్యావాదులుగా తీర్చిదిద్దారని,మొదటి ఉపాధ్యాయురాలుగా పేరు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత కుమారి.ఎంపీడీవో ఎస్ వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీవో మల్లిఖార్జున ఈవో పి ఆర్ డి విజయ బాబు, ఏవో జలజ,ఏ పి ఎం శివన్నారాయణ మండల ఏపీవో , శివపార్వతి, కార్యాలయ సిబ్బంది పాల్గోని నివాళుల ర్పించారు.

# ప్రజల హృదయాల్లో జనసేనకు ప్రత్యేక స్థానం... జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి...




పెన్ పవర్, గుంటూరు, మార్చి, 10. బాధ్యత , భద్రత , గౌరవం , జవాబుదారీతనం , పారిదర్శకత వంటి విలువలతో కూడిన రాజకీయాలే జనసేన పార్టీకి పునాది అని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ భావజాలం , నిస్వార్థ సేవా గుణంతో అయన ప్రజల హృదయాలను జయించారని అన్నారు. ఉద్యమి సభ్యత్వ నమోదులో భాగంగా నగరంలో జరుగుతున్న పలు సభ్యత్వ నమోదు కేంద్రాలను అయన మంగళవారం సందర్శించ్చారు. ఈ సందర్భంగా పార్టీ 30 డివిజన్ అధ్యక్షులు మామిడి రామారావు ఆధ్వర్యంలో ఎన్ జీ వో కాలనిలో జరుగుతున్న ఉద్యమి సభ్యత్వం తీసుకున్న వారిని సత్కరించారు. వారిని జనసేన పార్టీలోకి హృదయపూర్వకంగా ఆహ్వానించ్చారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ ఏ పార్టీలో లేని విధంగా జనసేనలో సభ్యత్వ నమోదు ఒక ఉత్సవంలా జరుగుతుందని అనందాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మకమైన మార్పులకు జనసేన కేంద్రబిందువుగా మారిందన్నారు. ఉన్నతమైన భావాలతో కూడిన యువతకు , మహిళలకు జనసేన పెద్దపీట వేస్తుందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా జనసేన ఉందన్న భరోసా , ధైర్యం ప్రజల్లో ఉన్నాయంటే అది పవన్ కళ్యాణ్ నాయకత్వ పటిమేనన్నారు. అవినీతికి తావులేని పవన్ కళ్యాణ్ సుపరిపాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారని ఆళ్ళ హరి కొనియాడారు. కార్యక్రమంలో మిర్చియార్డ్ డైరెక్టర్ కటకంశెట్టి విజయలక్ష్మి , నగర కార్యదర్శి మెహబుబ్ భాషా , జనసైనికులు పవన్ కుమార్, కోటా వెంకటేశ్వరరావు , కొండపల్లి శివరాం ప్రసాద్, తుమ్మల నాగేశ్వరరావు , అడపా వెంకటరావు, జాగు శ్రీహరి, తన్నీరు శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సమస్యల పరిష్కారమే ప్రధాన జెండాగా మహిళా జన్ సున్వాయ్....డా. రాయపాటి శైలజ మహిళా కమిషన్ చైర్ పర్సన్..





పెన్ పవర్, గుంటూరు, మార్చి, 10. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8 నుండి 13 వరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని మహిళా కమిషన్లు 'మహిళా జన్ సున్వాయ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మంగళవారం నాడు గుంటూరు జెడ్పి సమావేశ మందిరంలో ఉమ్మడి గుంటూరు( గుంటూరు, పల్నాడు, బాపట్ల) జిల్లాలలోని మహిళల సమస్యలపై పోలీస్, రెవెన్యూ, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, లీగల్ సెల్ అధికారులతో కలిసి మహిళా జన్ సున్వాయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... .మంగళగిరిలోని మహిళా కమిషన్ ప్రధాన కార్యాలయానికి రాలేని మహిళల కోసం 'మీ గడప వద్దకే మహిళా కమిషన్' అనే నినాదంతో జిల్లాల్లోనే మహిళా సమస్యలపై విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఐదు రోజుల్లో ఐదు జోన్లలో పర్యటించి పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను పరిశీలించడమే మా ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.నిన్న నెల్లూరులో,నేడు గుంటూరులో 'మహిళా జన్ సున్వాయ్' కార్యక్రమాన్ని నిర్వహించామని పాత పిటిషన్లతో పాటు కొత్తగా వచ్చే 'వాక్–ఇన్' పిటిషన్లను కూడా స్వీకరిస్తున్నామన్నారు.కేసుల పరిస్థితిని సమీక్షించి, బాధితులకు న్యాయం జరిగిందో లేదో తెలుసుకుంటున్నామన్నారు. సంతృప్తి చెందని పక్షంలో రీ–ఇన్వెస్టిగేషన్ జరపాలని అధికారులను ఆదేశిస్తున్నామన్నారు. మహిళల సమస్యలపై విచారణ జరిపించి అవసరమైన వారికి న్యాయ సహాయం కూడా చేస్తున్నామన్నారు. త్వరలో ప్రతి జిల్లాలో పర్యటించేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని మహిళలకు సమస్యలు ఏ రూపంలోఉన్నవాటినిపరిష్కరించడమేలక్ష్యంగా మహిళా కమిషన్ పనిచేస్తుందన్నారు.....

# మహిళల సమస్యల పరిష్కారానికి కృషి...ఎమ్మెల్యే గళ్లా మాధవి...





పెన్ పవర్, గుంటూరు, మార్చి, 10. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుండి మహిళలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే గళ్లా మాధవికి వినిపించారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాల కేటాయింపులు, టిడ్కో ఇళ్ల పంపిణీ మరియు నిర్మాణ సమస్యలు, అలాగే తమ నివాస ప్రాంతాల్లో జరుగుతున్న దొంగతనాలపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై సమగ్రంగా వివరించిన వినతిపత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి సమస్యను విన్న ఎమ్మెల్యే గళ్లా మాధవి వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళల భద్రత, గృహ సమస్యల పరిష్కారం మరియు సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. మహిళల సమస్యల పరిష్కారం తన ప్రాధాన్యాల్లో ఒకటని ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సమస్యలను తెలియజేయాలని, పార్టీ కార్యాలయం ఎల్లప్పుడూ వారికి అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు....

# చిలకలూరిపేట 'అపర భగీరథుడు' డాక్టర్ ఎస్. జాన్ డేవిడ్ -- సత్యవేదమ్మ పేరిట ప్రధాన రహదారి, ఆర్చ్

## మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేస్తాం... చైర్మన్ రఫాని వెల్లడి

## ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాలతో నిర్ణయం

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 10 : చిలకలూరిపేట : పట్టణ దాహార్తిని తీర్చి, ఆపదలో ఉన్నవారికి సహాయహస్తం అందించిన అపర భగీరథుడు, ఏఎంజీ సంస్థల అధినేత డాక్టర్ ఎస్. జాన్ డేవిడ్ -- సత్యవేదమ్మల స్మారకార్థం పట్టణంలోని ప్రధాన రహదారికి వారి పేరును నామకరణం చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రఫాని తెలిపారు. నరసరావుపేట సెంటర్ నుండి రిజిస్టర్ ఆఫీస్ వరకు ఉన్న రహదారిని ఇకపై డాక్టర్ ఎస్. జాన్ డేవిడ్ -- సత్యవేదమ్మ రహదారిగా పిలవనున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే ఆ మార్గంలో ప్రత్యేక ఆర్చ్‌ను కూడా నిర్మించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాలతో నిర్ణయం స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశానుసారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చైర్మన్ రఫాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడ విపత్తు సంభవించినా "నేనున్నాను" అంటూ ముందుకొచ్చి పేదలను, ఆపదలో ఉన్నవారిని ఆదుకున్న గొప్ప వ్యక్తి డాక్టర్ జాన్ డేవిడ్ అని కొనియాడారు. చిలకలూరిపేట నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు.

విద్యా, సామాజిక రంగాల్లో విశేష సేవలు

ఏఎంజీ సంస్థల ద్వారా డాక్టర్ జాన్ డేవిడ్ అందించిన సేవలను చైర్మన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఒకటి నుండి పది తరగతుల వరకు పాఠశాలల స్థాపన ఇంటర్, డిగ్రీ, ఐటీఐ కళాశాలల ఏర్పాట్లు నర్సింగ్, బీఈడీ వంటి వృత్తి




విద్యా కళాశాలల నిర్మాణం వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల నిర్వహణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల ఏర్పాటు

నా పదవీకాలంలో అత్యంత సంతృప్తినిచ్చిన నిర్ణయం

"నా ఐదు సంవత్సరాల మున్సిపల్ చైర్మన్ పదవీకాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశాను. కానీ చిలకలూరిపేట అభివృద్ధికి విశేష సేవలు అందించిన డాక్టర్ జాన్ డేవిడ్ పేరును ఒక ప్రధాన రహదారికి పెట్టడం నాకు అత్యంత సంతృప్తినిచ్చిన విషయం" అని చైర్మన్ రఫాని భావోద్వేగంగా తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారికంగా తీర్మానం చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# నరసరావుపేటలో రేషన్ షాపులు, అంగన్‌వాడి కేంద్రాలపై రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి. కాంతారావు ఆకస్మిక తనిఖీలు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి10: పల్నాడు జిల్లా నరసరావుపేటలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి. కాంతారావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రేషన్ షాపులు, అంగన్‌వాడి కేంద్రాలు, జిల్లా పరిషత్ హై స్కూల్, కే.జీ.బీ.వీ వసతి గృహాలు తదితర సంస్థలను పరిశీలించారు. మార్కెట్ యార్డ్ సమీపంలోని రెండు రేషన్ షాపులు, మున్సిపల్ హై స్కూల్, పెద్ద చెరువు వద్ద ఉన్న రెండు అంగన్‌వాడి కేంద్రాలు, కే.జీ.బీ.వీ వసతి గృహాలు, ఎం.జె.పి.డబ్ల్యూ.ఆర్ పాఠశాల మరియు వసతి గృహాలను ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిశీలించారు. అంగన్‌వాడి కేంద్రాల్లో పోషకాహార పంపిణీపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఆయన, కోడిగుడ్లు మరియు చికెన్ సరఫరా తక్కువగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు అందించే పోషకాహారం తక్కువగా ఉన్న నేపథ్యంలో సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో పలు మార్పులు చేపట్టారని అన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో కోడిగుడ్లతో పాటు పిల్లలకు ఇష్టంగా తినేందుకు ఫ్రైడ్ రైస్ ఏర్పాటు చేయడం, అన్ని పాఠశాలల్లో సన్న బియ్యం అందించడం మంచి నిర్ణయమని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల



సమర్థవంతమైన పర్యవేక్షణతో ప్రభుత్వ పథకాల అమలు మరింత మెరుగుపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఇంచార్జ్ డి.ఆర్.ఓ నారదముని, డి.ఎస్.ఓ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ ఎం. ఉమాదేవి, ఆర్ఎస్‌బీకే జిల్లా అధికారి రాజేశ్వరి దేవి, కే.జీ.బీ.వీ అధికారి రేవతి, డిప్యూటీ తహశీల్దార్ ప్రభాకర్, హై స్కూల్ హెడ్‌మాస్టర్, ఏడబ్ల్యూసీఎస్ అధికారులు, అంగన్‌వాడి టీచర్లు, ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రి భాయ్ పూలె 129వ వర్ధంతి...తురక రామారావు..

ఎన్ పవర్, గుంటూరు, మార్చి, 10. సావిత్రి భాయ్ పూలే 129 వ వర్ధంతి కార్యక్రమం గుంటూరు జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తురక రామారావు ఆధ్వర్యంలో స్థానిక లాల్ పురం రోడ్ లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని జరుపుకోవడం జరిగింది. మహిళల విద్య కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా వారికి భారతీయ జనతా పార్టీ జిల్లా ఓబీసీ మోర్చా వినమ్ర నివాళులు అర్పిస్తున్నామని తురక రామారావు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు చెరుకూరు తిరుపతిరావు మాట్లాడుతూ సమాజం మహిళల విద్యను అంగీకరించని కాలంలో, అవమానాలు అవరోధాలు.దాడులు ఎదుర్కొంటూ కూడా అమ్మాయిలకు విద్యా దీపం వెలిగించిన తొలి గురువుగా ఆమె చరిత్రలో నిలిచారు అని అన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చరక కుమార్ గౌడ్ మాట్లాడుతూ విద్యే సమానత్వానికి మార్గం అని నమ్మి, అణగారిన వర్గాల పిల్లలకు పాఠశాలలు ప్రారంభించి సమాజ మార్పుకు నాంది పలికిన గొప్ప సంస్కర్త సావిత్రి భాయ్ పూలే అని వారు చూపిన మార్గం మనకు ప్రేరణ అని విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం మనం కట్టుబడి పనిచేద్దాం అని అదే



సావిత్రిభాయ్ కి ఘననివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భీమినేని చంద్రశేఖర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి, ముద్రబోయిన నాగరాజు,జిల్లా మీడియా కన్వీనర్ వంకాయలపాటి మోహనబాబు కోశాధికారి కసినబోయిన శ్రీనివాసరావు జిల్లా కార్యదర్శి కానుమోలు సురేష్ కార్యవర్గం సభ్యులు పల్లపు విజయకుమార్,పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రి బాయి పూలే వర్ధంతి వేడుకలు

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 10 : చిలకలూరిపేట : స్థానిక మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు క్యాంప్ కార్యాలయంలో ప్రముఖ సంఘ సంస్కర్త, భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు శ్రీమతి సావిత్రి బాయి పూలే వర్ధంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించబడింది. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు తన్నీరు పుల్లారావు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు అవ్వరు లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మహిళల విద్యాభివృద్ధికి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సావిత్రి బాయి పూలే చేసిన కృషి అనన్యసామాన్యమని కొనియాడారు. సామాజిక మార్పు కోసం ఆమె పడ్డ తపన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి



మహనీయులకే స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి బీసీలకు, మహిళలకు పెద్దపీట వేస్తోందని.. నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి విప్లవాత్మక మార్పులు తెచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా అదే బాటలో పయనిస్తూ, డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేశారని, ఇప్పుడు 'స్త్రీ శక్తి' పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, సీనియర్ నాయకులు తుపాకుల అప్పారావు, మిరియాల రత్నకుమారి, క్లస్టర్ ఇంచార్జీలు, కౌన్సిలర్లు మరియు పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# సుదీర్ఘకాలం వేచి చూస్తున్నా అర్హులైన దివ్యాంగులకు జి ఓ విడుదల...

## నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్. కాలేషా...

పెన్ పవర్, గుంటూరు, మార్చి, 10. తాడేపల్లి లోని ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె. వి. ఎన్. చక్రధర్ బాబు కలిసి. ఆంధ్రప్రదేశ్ లో అర్హులైన. దివ్యాంగులకు బ్యాక్లాగ్ పోస్టుల నోటిఫికేషన్ రాష్ట్రవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ప్రభుత్వం జి ఓ . ఎం.ఎస్ . నెంబర్. 15 విడుదల చేసి తేదీ.31/03/2026 న నోటిఫికేషన్ కి ఆఖరు గడువుగా ప్రకటించారు. ఎంతోమంది సదరం స్లాట్ ల కొరకు ఎదురుచూస్తూ ఉన్నారు. సదరం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ చేసుకొని సదరం సర్టిఫికెట్ లు రాక నెలలో తరబడి ఎదురుచూస్తున్నారు.వెంటనే సదరం స్లాట్ లను ఆన్ లైన్ లో విడుదల చేయాలని కోరిన నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్. కాలేషా. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుదీర్ఘకాలం వేచి చూస్తున్నా అర్హులైన దివ్యాంగులకు తేదీ.14/11/2025 న జి ఓ . ఎం.ఎస్ .అశీ. 15 విడుదల చేసి తేదీ.31/03/2026 న నోటిఫికేషన్ విడుదల చేయటానికి గడువుగా నిర్ణయించింది అయితే ఎంతోమంది దివ్యాంగులు సదరం స్లాట్ బుకింగ్ కొరకు ఎదురు చూస్తున్నారు. గతంలో ప్రతి నెల సదరం స్లాట్ బుకింగ్ జరిగేది కానీ ప్రస్తుతం మూడు నెలలకు ఒకసారి ఆన్లైన్ విధానం మార్చడంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు దివ్యాంగుల



బ్యాక్లాగ్ పోస్టులు విడుదల చేయటానికి గడువు తక్కువగా ఉండటంతో దివ్యాంగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమరు వెంటనే అర్హులైన దివ్యాంగులకు సదరం స్లాట్ బుకింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరడం జరిగింది. అలాగే ఇప్పటివరకు. రాష్ట్రవ్యాప్తంగా సదరం సర్టిఫికెట్ ల కోసం రీ వెరిఫికేషన్ జరుపుకున్న దివ్యాంగులకు వెంటనే సదరం సర్టిఫికెట్లను జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత విషయాలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు కూడా ఇవ్వటం జరిగింది...

# మాదకద్రవ్యాల నిర్మూలనకు 'డాండీ మార్చ్ 2.0' కరపత్రం విడుదల

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 10 : చిలకలూరిపేట : గ్రామీణాభివృద్ధి, విద్య, వ్యవసాయం, వైద్య రంగాల్లో సేవలందిస్తున్న లిటరసీ అగ్రికల్చర్ అండ్ మెడికల్ ప్రాజెక్ట్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ల్యాంప్) సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "డాండీ మార్చ్ 2.0 -- ప్రపంచంలోనే అతిపెద్ద మాదకద్రవ్య రహిత ర్యాలీ" కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని మాజీ మంత్రి, శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు తన శిబిర కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. 1930లో మహాత్మా గాంధీ చేపట్టిన చారిత్రాత్మక డాండీ మార్చ్ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా మత్తు పదార్థాల నిర్మూలన



కోసం ఈ డాండీ మార్చ్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం మార్చి 12, 2026న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేకంగా సమాజానికి బలమైన సందేశం ఇవ్వాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ల్యాంప్ ప్రాజెక్టు సంచాలకుడు కొండపల్లి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, చిలకలూరిపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జవ్వాజి మదన్ మోహన్, చిలకలూరిపేట పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, క్లస్టర్ ఇంచార్జి షేక్ ముల్లా కరీముల్లా, కె.బి. రోడ్డు మస్తాన్ వలి, ప్రాజెక్టు ప్రతినిధి టీ. మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల దృష్టి మళ్లించేందుకే స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం - ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు




నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి10: లోక్‌సభలో స్పీకర్‌పై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం జరిగిన చర్చలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు, సభలో గందరగోళ వాతావరణాన్ని సృష్టించేందుకే ప్రతిపక్షాలు స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకువచ్చాయని ఆయన విమర్శించారు. స్పీకర్‌గా ఓం బిర్లా వ్యవహార శైలిని దేశం ఎన్నో సంవత్సరాలుగా చూస్తోందని, ఆయన సభను సజావుగా మరియు గౌరవప్రదంగా నడిపించారని అయన తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, ట్రిపుల్ తలాక్ బిల్లు వంటి దేశ భవిష్యత్తుకు దారితీసే అనేక కీలక బిల్లులు ఆయన హయాంలోనే ఆమోదం పొందినట్లు ఆయన చెప్పారు. సమయపాలనతో పాటు అన్ని పార్టీల సభ్యులకు మాట్లాడేందుకు అవకాశం కల్పిస్తూ సభను నడిపించడంలో ఆయన నిబద్ధతతో పని చేశారని పేర్కొన్నారు. కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ లోక్‌సభ సమావేశాలు సజావుగా నిర్వహించడంలో స్పీకర్ కీలక పాత్ర పోషించారని అయన అన్నారు. 17వ లోక్‌సభకు 97 శాతం ప్రొడక్టివిటీ రేటు రావడం ఆయన నాయకత్వానికి నిదర్శనమని తెలిపారు. అసలు స్పీకర్‌పై ప్రతిపక్షాలు ఎందుకు అవిశ్వాస తీర్మానం పెట్టాయో కూడా స్పష్టంగా తెలియని పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఈ విషయంపై చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రతిపక్షాలు సభలోనూ బయటా అడ్డంకులు సృష్టిస్తూ గందరగోళాన్ని పెంచుతున్నాయని విమర్శించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారని, ఎన్నికల్లో ఓటమి బాధతోనే ప్రతిపక్షాలు ఇలా ప్రవర్తిస్తున్నట్లుగా కనిపిస్తోందని తెలిపారు. ప్రతిపక్షాలు తరచుగా మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేర్లను ప్రస్తావిస్తాయని, కానీ వారి ఆశయాలకు అనుగుణంగా ప్రవర్తించడం కూడా అవసరమని సూచించారు. గాంధీజీ సత్యం, అహింస మార్గాల్లో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించి దేశాన్ని సన్మార్గంలో నడిపించారని గుర్తుచేశారు. చరిత్రలో బ్లాక్ డేగా నిలిచిపోయే సంఘటనగా 2014 ఫిబ్రవరి 14న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. రాష్ట్ర అసెంబ్లీ వ్యతిరేకించినప్పటికీ, అప్పటి అధికార కాంగ్రెస్ ప్రభుత్వం లోక్‌సభలో తలుపులు మూసి, లైవ్ టెలికాస్ట్ నిలిపివేసి అన్యాయంగా రాష్ట్ర విభజన బిల్లును ఆమోదించిందని గుర్తుచేశారు. అటువంటి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రాజ్యాంగ విలువలు, స్పీకర్ వ్యవహారంపై మాట్లాడడం విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు. 2014 ఫిబ్రవరి 14ను బ్లాక్ డేగా నిర్ణయించి, ఆ సంఘటనపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని, సభలో దీనిపై సమగ్ర చర్చ జరగాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు.

# ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ లో చందోల్ ఎస్సై వెంకట శివకుమార్.



పిట్లవానిపాలెం పెన్ పవర్ న్యూస్. చందోలు పోలీస్ స్టేషన్ ఎస్ఐ మర్రి వెంకట శివకుమార్ ఉన్న రెడ్డిపాలెం టోల్ గేటు వద్ద ప్రజలకు ప్రముఖ సూచనలు చేశారు. యువత ఏ విధంగానైన డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటివలన శారీరక మానసిక ఆరోగ్యంలో తీవ్ర నష్టం కలుగుతుందని ఆయన హెచ్చరించారు. అలానే గ్రామస్తులు కోడి పందాలు, పేకాటలు ఇతర జూదాలకు సంబంధించిన క్రీడలు ఆడరాదని తెలియపరచనారు. సైబర్ నేరాలు పెరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరు ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తగా ఉండి, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని సూచించారు. దొంగతనాలు, చోరీలు జరగకుండా ప్రతి ఇంటి ముందు, వ్యాపార కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లల చేత వాహనాలు నడపనివ్వకూడదని స్పష్టం చేశారు. వాహనాన్ని నడిపే ప్రతి వ్యక్తి చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. రెండు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తమ భద్రతను నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు. తన ప్రసంగంలో ప్రజలు చట్టాలను పాటించి, సమాజ అభివృద్ధికి భాగస్వాములు కావాలని ఎస్ఐ మర్రి వెంకట శివకుమార్ కోరారు.


# అధిక సభ్యత్వ నమోదుకు ప్రతి ఉద్యమి నేతలు కృషి చేయాలి: రాజేష్



వేమూరు(భట్టిప్రోలు), పెన్ పవర్ మార్చి, 10: జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 17 వరకు పొడిగించడం జరిగిందని వేమూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త వుసా రాజేష్ అన్నారు. మంగళవారం మండలంలోని చావలి గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న రాజేష్ మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గ పరిధిలో గత సంవత్సరం 4,162 వరకు సభ్యత్వ నమోదు చేయడం జరిగినదన్నారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు 6,200 పైచిలుకు సభ్యత్వ నమోదు జరిగిందని, వేమూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలలో 17వ తేదీ లోపు సభ్యత్వ కార్యక్రమంలో ఉద్యమీ లు అందరూ పాల్గొని కష్టపడి 15,000 సభ్యత్వాలు పూర్తి చేయాలని రాజేష్ కోరారు. సభ్యత్వ నమోదులో పాల్గొని ఇతోధిక కృషి చేస్తున్న ప్రతి ఒక్క ఉద్యమి జనసేన నేతలకు రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి కాల్వ గుప్త, బొందలపాటి మురళి,చావలి ఉప సర్పంచ్ సోమరవుతూ శివ పద్దయ్య,పెనమర్రు సాగునీటి సంఘం అధ్యక్షులు దాసరి శ్రీనివాసరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేసవి కార్యాచరణకు సిద్ధం






గుంటూరు:పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: జిల్లాలో వేసవి కార్యాచరణకు సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. వేసవి ముందస్తు చర్యలపై రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత జిల్లా కలెక్టర్ లు, గ్రామీణ నీటి సరఫరా, మునిసిపల్, రెవెన్యూ, విద్య, పశు సంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ, అగ్నిమాపక శాఖ తదితర శాఖలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండల కార్యాలయాలు, జనకూడలి ప్రదేశాల్లోనూ, ఇతర అవసరమైన ప్రాంతాల్లో చలివేంద్రియాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో తాగునీటి సమస్య ఏర్పడే గ్రామాలు గుర్తించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, అటువంటి గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందన్నారు. బోర్లను 24 గంటలలో మరమ్మతులు పూర్తి చేయుటకు అవసరమైన విడి పరికరాలు సిద్ధంగా పెట్టుటకు ఏర్పాట్లు చేసామని వివరించారు. వడ దెబ్బకు గురి కాకూడదని అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడం జరుగుతోందని చెప్పారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పనులు ఉంటే మినహా ఎవరు బయటకు రావద్దని విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొన్నారు. అత్యవసర పనులకు బయటకు వస్తే గొడుగు ఉపయోగించాలని, వదులు దుస్తులు ధరించాలని, తగినంత నీటిని తగలని సూచిస్తున్నామని చెప్పారు. చిన్నారులు, వయసు మీరినవారు బయటకు వెళ్లకుండా కుటుంబ సభ్యులు చూడాలని సూచిస్తున్నట్లు చెప్పారు. కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ చలివేంద్రియాలు అవసరమగు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి తీవ్రత వలన మనుషులు గాని, పశువులు గానీ మృత్యువాత పడకుండా ఉండటమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో 1070 టోల్ ఫ్రీ నంబర్ కు ప్రజలు ఫోన్ చేయవచ్చని చెప్పారు. పర్యాటక ప్రదేశాలు, రద్దీ ఉండే దేవాలయాల వద్ద, హాట్ స్పాట్ లుగా గుర్తించిన ప్రదేశాల్లో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు పర్యవేక్షణ పక్కాగా ఉండాలని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తరాదని స్పష్టం చేశారు. వైద్య శిబిరాలు నిర్వహించి, అవసరమగు మందులు, ఓ.ఆర్.ఎస్ పాకెట్స్ సిద్ధంగా ఉంచాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, విపత్తుల నిర్వహణ జిల్లా మేనేజర్ లక్ష్మీ కుమారి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# శనగల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 10 : ఎడ్లపాడు: పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు మంగళవారం ఎడ్లపాడు మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.ఏపీ మార్క్‌ఫెడ్ మరియు నాఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పై శనగలు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మండలంలోని అందరు రైతులు ఈ సౌకర్యాన్ని అందుపొందుకొని, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా క్వింటాకు రూ.5,875 చొప్పున శనగలు అమ్ముకోవాలని సూచించారు.తదుపరి ఎడ్లపాడు పరిధిలో రబీ పంట కాలంలో నమోదు చేసిన పంట వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే, రాతపూర్వకంగా రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి గ్రీవెన్స్ అర్జుల ద్వారా సరిచేసుకోవచ్చని రైతులకు తెలియజేశారు.ఈ ముసాయిదా జాబితా మార్చి 9 నుంచి 14 వరకు సరిచేసుకునే అవకాశం కల్పించబడింది. తుది జాబితా మార్చి 15న అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ.హరిప్రసాద్, సొసైటీ సీఈఓ శ్రీనివాసరావు,రైతు సేవా కేంద్ర సిబ్బంది అనుపమ,బిలాల్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు

# మంచినీటి కోసం గుర్రాలపై 2 కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే ..!



వి.మాడుగుల (అనకాపల్లి) :పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: వి.మాడుగుల మండలం ఆవురువాడ పంచాయతీ పరిధిలో పశువులు బంద కొండ శిఖర గ్రామంలో 7 కుటుంబాలు కొందు గిరిజనులు జీవనం సాగిస్తూ ఉన్నారు. మంచినీటి కోసం జీలుగులో గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరం గడ్డ చలమనుండి నీళ్లు తెచ్చుకుంటున్నారు. ప్రతిరోజు ఉదయం గుర్రాల మీద బిందెలు మోసుకొస్తున్నారు. ఈ నీరు తాగడం తరచూ అనారోగ్యానికి గురవుతుంది. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో డోలు కట్టుకొని. రావికమతం మండలంలో చిములపాడు పంచాయతీ దానిమాని సెంటర్ వద్దకు డోలు కట్టుకొని మంచినీటిని తీసుకొచ్చే పరిస్థితి. మంచినీళ్లు కోసం ప్రజా ఫిర్యాదు వేదిక ఎఎన్‌పిఎల్ 202504282819 తేదీ :28-4-2025 ఫిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదుకు జిల్లా పరిషత్ జనరల్ ఫండ్ నుండి నాలుగు లక్షల రూపాయలు ట్యాంకు, పైప్ లైన్ ద్వారా కోసం నిధులు మంజూరు చేశారు. అసిస్టెంట్ ఇంజనీర్ పశువుల బంద్ గ్రామాన్ని పరిశీలన చేశారు. ట్యాంక్ నిర్మాణం కోసం. ఇసుక. తిక్క. గుర్రాల ద్వారా పశువుల బంద్ గ్రామానికి నడపడం జరిగింది. నేటికి ఆరు నెలలు అవుతున్నప్పటికి ఎలాంటి పనులు చేపట్టలేదు. వేసవికాలం రావడంతో గుర్రాలతో బిందులు మోసుకెళ్లే పరిస్థితి. ఇంటింటి కొళాయిలు వేస్తామని చెప్పి. నెలలు దాటుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీనికోసం అధికారులకు అనేకసార్లు తెలియజేసినప్పటికీ త్వరలోనే పూర్తి చేస్తాం అంటున్నారు.

# గుడ్ షెఫర్డ్ కాన్వెంట్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం






అమరావతి పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: ఈరోజు గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అమరావతి లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా దినోత్సవ వారోత్సవాలను గుడ్ షెఫర్డ్ ఆవరణలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత గుడ్ షెఫర్డ్ సంస్థ డైరెక్టర్ సిస్టర్ అంటో వహించి మాట్లాడుతూ కనులు తెరిచిన క్షణం నుండి బంధం కోసం బాధ్యత కోసం అందరికీ ఆత్మీయత పంచి తన వారి కోసం అహర్నిశలు కృషించి వారి భవిష్యత్తు కోసం ఇంటిని నందనవనం చేసే ప్రతి స్త్రీ మూర్తికి అభివందనం చేస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు అని అన్నారు. ముఖ్యఅతిథిగా పల్లోటి ఫాదర్స్ రీజనల్ డైరెక్టర్ ఫాదర్ బాలాజీ బోయెల్ల గారు విచ్చేసి మాట్లాడుతూ ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు ఉంటారని స్త్రీలను గౌరవించడం మన సాంప్రదాయం అన్నారు. ఈ గుడ్ షెఫర్డ్ సంస్థని స్థాపించింది ఒక మహిళ . ఈ సంస్థ 74 దేశాల్లో పని చేస్తుందన్నారు . గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ ని మొదట ఆడవాళ్ళ హక్కుల సంఘం సిస్టర్స్ అనేవాళ్ళు మహిళల హక్కుల కోసం పనిచేస్తున్న సిస్టర్స్ కి ధన్యవాదాలు అన్నారు. డిప్యూటీ ఎంపీడీవో పద్మశ్రీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందు ఉన్నారు అందుకే అందరికీ అవకాశం ఇవ్వాలి ఆడపిల్లల్ని బాగా చదివించాలి అన్నారు. అమరావతి మండల తహసిల్దార్ డానియల్ మాట్లాడుతూ మహిళలు తక్కువ ఎం కాదు పురుషులతో సమానంగా ఉన్నారన్నారు. అందుకే ప్రతి ఆడపిల్లల్ని చదివించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. హై కోర్ట్ అడ్వకేట్ కృష్ణాంజనేయులు మాట్లాడుతూ మహిళలు సహకార సంఘాల ద్వారా అభివృద్ధి చెందాలన్నారు. మహిళలు వాళ్ళకున్న సమస్యలు ఎదుర్కొనే విధంగా తయారవ్వాలి అన్నారు. ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ మహిళలు లేకపోతే సృష్టి లేదు సృష్టికి మూలం మహిళ అన్నారు. ఉదయం లేచిన కానుంచి మొదలు రాత్రి పడుకునే దాకా మహిళలు అన్ని రంగాల్లో 100% పని చేస్తున్నారన్నారు. ఫాదర్ వినోద్ మాట్లాడుతూ ఒక కుటుంబం సంతోషంగా ఉందంటే అందుకు ఆ కుటుంబంలో స్త్రీలే కారణం ఉన్నారు. పల్లోటి విచారణ గురువులు బెజ్జం కిషోర్ ఫాదర్ మాట్లాడుతూ స్త్రీ లేకపోతే ఇల్లంతా గందరగోళంగా ఉంటుందన్నారు ఏ చిన్న దెబ్బ తగిలిన అమ్మ అని అంటాము అంటే స్త్రీ గొప్పతనం అంతా ఉందన్నారు.

# పిడుగుపాటుతో మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సహాయం



చేబ్రోలు: పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామానికి చెందిన పల్లా అంకమ్మరావు 21.05.2025 వ తేదీన పిడుగుపాటుకు గురి అయ్యి మరణించారు.పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ చొరవతో అంకమ్మరావు కుటుంబసభ్యులకు ఎక్స్ గ్రేషియా ద్వారా 4,00,000/- అందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సూచనల మేరకు చేబ్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు మరియు గ్రామతెలుగుదేశం పార్టీ నాయకులచే ఆ ఉత్తర్వుల పత్రాలను వారి కుటుంబసభ్యులకు అందజేశారు.

# పారేపల్లిపుష్పలతను ఘనంగాసన్మానించిన వాసవి క్లబ్ వనిత క్లబ్ సభ్యులు



అమరావతి పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: అమరావతి మహిళలు నేటి పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆర్యవైశ్య వాసవి క్లబ్ వనిత పట్టణఅధ్యక్షురాలు పారేపల్లి పుష్పలత అన్నారు అనంతరం వాసవి వనితా క్లబ్ పట్టణ అధ్యక్షురాలు పారేపల్లి పుష్పలతను అత్యంతఘనంగాసన్మానించారు.శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## జనసేన సభ్యత కార్యక్రమంలో పాల్గొన్న బయ్యవరపు నరసింహారావు



అమరావతి పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: పల్నాడు జిల్లా అమరావతి మెయిన్ రోడ్ లో గల రామాలయం సెంటర్లోదేశ ప్రయోజనాలు రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కార్యకర్త కుటుంబానికి భరోసాగా పనిచేస్తున్న జనసేన పార్టీ ఆధ్వర్యంలో అమరావతి మండలంలోని సీనియర్ నాయకులు లాం వంశీ ఆధ్వర్యంలో సభ్యత్వం నమోదు కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో పెద్దకూరపాడు నియోజకవర్గ సీనియర్ నాయకులు బయ్యవరపు నరసింహారావు లీగల్ సెల్ కోలా రమణ విన్నకోట గోపి తదితరులు పాల్గొన్నారు

## సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఘన నివాళి.



జగ్గయ్యపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు సావిత్రి భాయ్ పూలే వర్ధంతి సందర్భంగా జగ్గయ్యపేట పట్టణం కమల థియేటర్ సమీపంలో ఉన్న వారి విగ్రహానికి జగ్గయ్యపేట నియోజకవర్గ జనసేన నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు , జనసేన నాయకులు చిలుకూరి శ్రీనివాసరావు , షౌకత్ అలీ , ఈమని కిషోర్ కుమార్ , పాల హరికృష్ణ , మేదూరి వెంకటాద్రి , బండి నరేష్ , సనకా మురళి , దేవరగట్ల రాజేంద్ర , నవీన్ , కొలగాని సైదులు , తదితరులు పాల్గొన్నారు.

## హైవే పై ట్రాఫిక్ రూల్స్ పాటించాలి - చిల్లకల్లు యస్ఐ సూర్య శ్రీనివాస్



జగ్గయ్యపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: జగ్గయ్యపేట మండలం లో గల నేషనల్ హైవే 65 పై ద్విచక్ర వాహనాలను నడిపే వారు క్షేమంగా ఇంటికి చేరుకోవటానికి హెల్మెంట్,కారు నడిపేటప్పుడు సీటు బెల్టు తప్పని సరిగ ధరించాలని చిల్లకల్లు యస్ఐ సూర్య శ్రీనివాస్ వాహనదారులకు అవహన కల్పించారు.జాతీయ రహదారి భద్రతా,ప్రమాదాల నివారణ కోసం విజయవాడ సిపి వారి ఆదేశాల మేరకు, రూరల్ డిసిపి వారి ఆధ్వర్యంలో నందిగామ ఏసిపి వారి పర్యవేక్షణ జగ్గయ్యపేట సిఐ పి.వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో సురక్షిత ప్రయాణం కోసం హైవే పై ప్రయాణించే వాహనదారులకు అవగాహన కల్పించడం జరిగింది.ద్విచక్ర వాహనాల పై ప్రయాణించే వారు హెల్మెంట్,కారు నడిపే వారు సీటు బెల్టు ని తప్పని సరిగా ధరించాలని,వాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్,ఇన్సురెన్స్,వాహనాల కాగితాలు ఫోర్స్ లో ఉంచుకోవాలన్నారు.వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ ని పాటించాలని,మితిమీరిన వేగంతో కూడిన ప్రయాణం,త్రిబుల్ రైడింగ్ ప్రమాదాలకు దారి తీస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో చిల్లకల్లు యస్ఐ 2 యస్ మణికంఠ,చిల్లకల్లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.






## జూన్ నాటికి సాకారం కానున్న పేదల సొంతింటి కల: ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



జగ్గయ్యపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: జగ్గయ్యపేటలో వేగంగా సాగుతున్న టిడ్కో గృహాలపనులు – తొలి విడతలో 1,480 ఇళ్ల పంపిణీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా, జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పేద ప్రజల దశాబ్దాల కల అయిన సొంతింటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) నడుం బిగించారు. మంగళవారం జగ్గయ్యపేట పట్టణంలోని టిడ్కో గృహ సముదాయాలను మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తో కలిసి ఆయన స్వయంగా పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య , అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ

గత ప్రభుత్వ వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2014-19 మధ్య కాలంలోనే ఈ టిడ్కో ఇళ్ల పనులు 80 శాతం పూర్తయ్యాయని ఆయన గుర్తు చేశారు. "గత ప్రభుత్వం కేవలం రాజకీయ కక్షతో, పేదవాడికి ఇల్లు దక్కకూడదనే దుర్బుద్ధితో ఈ ప్రాజెక్టును గాలికొదిలేసింది. ఐదేళ్ల పాటు ఈ ఇళ్లను పట్టించుకోకపోవడంతో అడవి మొక్కలు మొలిచి, పాములకు నిలయంగా మారాయి. లబ్ధిదారులు తాము కట్టిన సొమ్ము ఏమవుతుందోనని ఆందోళన చెందారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం ఆ చీకటి రోజులకు తెర దించింది" అని పేర్కొన్నారు. నాటి ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత నాణ్యమైన ప్రమాణాలతో, షీర్ వాల్ టెక్నాలజీతో ఈ ఇళ్లను నిర్మించారని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కొనియాడారు. "చంద్రబాబు నాయుడు ముందస్తు చూపు వల్లే, ఐదేళ్ల పాటు ఎటువంటి నిర్వహణ లేకపోయినా ఈ భవనాలు నేటికీ చెక్కుచెదరకుండా పటిష్టంగా ఉన్నాయి. ఇప్పుడు మా ప్రభుత్వం వీటికి మెరుగులు దిద్ది, మౌలిక వసతులు కల్పించి ప్రజలకు అప్పగించబోతోంది" అని వెల్లడించారు. జగ్గయ్యపేట పట్టణ పరిధిలో మొత్తం 3,180 గృహాలను వీలైనంత త్వరగా లబ్ధిదారులకు అందజేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్పష్టం చేశారు. ఫేస్-1 ప్రణాళిక: మొదటి విడతలో భాగంగా 1,480 ఇళ్లను పూర్తి చేసి, వచ్చే జూన్ నాటికి లబ్ధిదారులతో గృహప్రవేశం చేయిస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న ఫినిషింగ్ పనులు, పెయింటింగ్ మరియు ఇతర చిన్న చిన్న మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మౌలిక వసతుల కల్పన – టెండర్లు పూర్తి.

కేవలం ఇళ్లు ఇవ్వడమే కాకుండా, ఒక మోడల్ కాలనీగా దీనిని తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు. మౌలిక వసతులు: రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ మరియు తాగునీటి సరఫరా కోసం ఇప్పటికే ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలవడం జరిగింది. ఉగాది నాటికి శ్రీకారం: టెండర్ దారులు ఉగాది నాటికి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాము. సమగ్ర అభివృద్ధి: కాలనీలో పార్కులు, కమ్యూనిటీ హాల్స్ వంటి వసతులపై కూడా దృష్టి సారించాము. ఈ బృహత్తర కార్యక్రమం గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జరుగుతోందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. పేదల సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, గింజుపల్లి వెంకట్రావు, సంగెపు బుజ్జిబాబు, కర్ల జోజి , గుమ్మ వెంకటేష్ మరియు టిడ్కో ఇంజనీర్లు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కరాటేలో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



ఆలమూరు :పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఈ నెల 8న వాసవి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అంతర్జాతీయ ఓపెన్ కరాటే పోటీలలో ఆలమూరు మండల కేంద్రంలోని శ్రీ సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని అ స్కూల్ అధినేత కె.ముల్లారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం విజేతలను అభినందించి వివరాలు వెల్లడించారు. బ్లూబెల్ట్ ఎ విభాగంలో గుత్తుల షణ్ముఖ గోల్డ్ మెడల్, బ్లూ బెల్ట్ బి విభాగంలో గెద్దాడ జారు కిరణ్ సిల్వర్ మెడల్ సాధించారన్నారు. జూనియర్స్ ఎల్లో బెల్ట్ బి విభాగంలో కోడూరి శ్రీ ఉదయ కృష్ణ దుర్గ సాకేత్, పాలూరి చరణ్ సంతోష్ కుమార్ బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు ఆయనతో పాటు కోచ్ టీ.వెంకటలక్ష్మి వివరించారు. అలాగే విజేతలను అభినందించిన వారిలో ప్రిన్సిపల్ గుణశేఖర్, ప్రైమరీ ప్రిన్సిపల్ జెసినా, ఉపాధ్యాయులు ఉన్నారు.

## వరికి మొవ్వు, దోమ పోటు సోకే అవకాశం



పెద్దాపురం : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: వరి పంటలో వాతావరణ పరిస్థితులను బట్టి మొవ్వు పోటు, దోమపోటు అధికంగా సోకే అవకాశాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు ఎన్.విజరు కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని వడ్లమూరు, గోరింట గ్రామాలలో వరి, మొక్కజొన్న, చిరు సంచుల ప్రదర్శన క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి చేలు అంకురం ఏర్పడే దశలో ఉన్నాయన్నారు. ఈ దశలో పొటాష్ ఎరువును వినియోగించడం వల్ల తెగుళ్లు, పురుగులను తట్టుకుంటుందన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులందరూ తప్పకుండా రిజిస్ట్రీ చేయించుకుని 11 అంకెల విశిష్ట సంఖ్యను పొందాలన్నారు. రాబోయే కాలంలో ఈ విశిష్ట సంఖ్యను ఆధారంగా వ్యవసాయ శాఖ ద్వారా అందించే పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సబ్సిడీపై ఎరువులు, ఇన్పుట్ సబ్సిడీలు రైతులకు అందుతాయన్నారు.

## అంగన్‌వాడీలకు ఉగాదిలోపు వేతనాలు పెంపు



అమరావతి : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: అంగన్‌వాడీలకు వేతనాల పెంపుపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి), ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) డిమాండ్ చేశాయి. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో 3 అంగన్‌వాడీ యూనియన్ల ప్రధాన కార్యదర్శులు సుబ్బరావమ్మ, లలితమ్మ, వీఆర్ జ్యోతి, ఇతర నేతలు మంగళవారం సమావేశమై అంగన్‌వాడీల డిమాండ్లపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంగన్‌వాడీల ప్రధాన డిమాండైన వేతనాల పెంపు అంశంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ముఖ్యమంత్రితో మాట్లాడిన అనంతరం యూనియన్లతో మరోమారు సమావేశమవుతామని చెప్పారు. ఉగాదిలోపు ఈ అంశాన్ని తేల్చాలని, లేనిపక్షంలో ఆందోళనలకు సిద్ధమవుతామని యూనియన్ నేతలు స్పష్టం చేశారు. ఇతర డిమాండ్లను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రాట్యుటీ చెల్లించే విషయంలో నియమ, నిబంధనలు రూపొందించి అమలు చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని స్పష్టం చేశారు. మే నెల మొత్తం వేసవి సెలవులు ఇచ్చే అంశంలో తెలంగాణ ఇచ్చిన ఉత్తర్వులను పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అంగన్‌వాడీలకు పిఆర్‌సి, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులు న్యాయస్థానంలో తీర్పు వచ్చిన వెంటనే అమలు చేస్తామన్నారు. మిగిలిన అంశాలు మరోసారి యూనియన్ నేతలతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ చర్చల్లో మహిళా శిశుసంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి సూర్యకుమారి, ఐసిడిఎస్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి బేబిరాణి, రాష్ట్ర నాయకులు ఎంసిహెచ్ సుప్రజ, ఎం నాగశేషు, బి.లక్ష్మీదేవి, ఇ చంద్రావతి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పేమలత, మంజుల, రేణుక, ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పి భారతి తదితరులు పాల్గొన్నారు.

## జనాభా పాలసీ పేరుతో తల్లుల హక్కులకు భంగం : ఐద్వా

అమరావతి : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: జనాభా పాలసీ పేరుతో.. కార్పొరేట్ సంస్థల కోసం అధిక సంతానాన్ని కనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడం తల్లుల ప్రాథమిక హక్కును కాలరాయడమేనని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి వి సావిత్రి పేర్కొన్నారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆవెం మాట్లాడారు. రెండేళ్ల కిందట ఆర్‌ఎస్ఎస్ దేశంలో ముస్లిముల జనాభా పెరుగుతుందని, హిందువులు పిల్లల్ని అధికంగా కనాలని పిలుపునిచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆర్‌ఎస్ఎస్ ఎజెండా అమలు చేసేందుకే ముఖ్యమంత్రి.. అధికంగా పిల్లలను కనాలని, మూడవ బిడ్డ నుంచి రూ.25 వేలు ప్రోత్సాహకాలు ఇస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. తమ కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఎంత మంది సంతానాన్ని కనాలనే విషయంలో వివాహితలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మహిళల్లో 80 నుంచి 90 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, దీనివల్ల కాన్పుల సమయంలో కొన్నిసార్లు తల్లులు, మరికొన్ని సార్లు బిడ్డలు మరణిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కాన్పు చేయించుకోవాలంటే రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. సిజేరియన్ల సమయంలో వెన్నుముఖకు చేస్తున్న ఇంజెక్షన్ల కారణంగా మహిళలు గర్భసంచిని తీయించుకోవాల్సి వస్తుందని వెల్లడించారు. ప్రభుత్వాస్పత్రుల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు, వైద్యుల నియామకాలు జరగలేదని తెలిపారు. ఈ పరిస్థితులను చక్కదిద్దకుండా పిల్లన్ని కనాలని సిఎం చెప్పడం సరైంది కాదన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పిల్లల్ని చదివించాలంటే అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. మరోవైపు పేదలు తమ పిల్లలకు పెళ్లిళ్లు చేస్తే ఉండేందుకు గూడు ఉండటం లేదన్నారు. పేదలు సొంత ఖర్చుతో ఇళ్లు నిర్మించుకోలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. మహిళలకు ఎన్నికల సమయంలో ఇస్తానన్న రూ.1,500 ఇచ్చే విషయంపై ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఐద్వా అధ్యక్షులు కె శ్రీదేవి మాట్లాడుతూ.. ఎక్కువ మంది పిల్లలను కనేందుకు, వారిని పెంచేందుకు అవసరమైన ఆర్థిక పరిస్థితి అనేక కుటుంబాలకు లేదన్నారు. కనీసం పౌష్టికాహారం తీసుకునే పరిస్థితిలో మహిళలు లేకపోవడంతో రక్తహీనతకు గురవుతున్నట్లు చెప్పారు. పిల్లలకు అవసరమైన విద్య, వైద్యం నేడు భారంగా మారాయని, వీటిని పూర్తి ఉచితంగా అందించడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని సూచించారు. బడ్జెట్‌లో తగిన కేటాయింపులు లేకపోవడంతో చదువుకున్న వారికి ఉద్యోగాలు లేవన్నారు. యువత డ్రగ్స్, గంజాయి బారిన పడుతున్నారని, ఈ నేపథ్యంలో మహిళలు ఎక్కువ మంది పిల్లల్ని ఎలా కనగలరని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి టి శ్రీనివాసకుమారి, రాష్ట్ర కమిటీ సభ్యులు టి శ్రీదేవి, అమలాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం



అమరావతి : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు టి.ఆంజనేయులు అన్నారు. స్థానిక తల్లం బ్రహ్మయ్య స్మారక భవనంలో సోమవారం నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపెద్ద అపార్ట్మెంట్ల నిర్మాణ పనుల్లో భాగంగా అనేక మంది కార్మికులు ప్రమాదాల బారిన పడి చనిపోతున్నారని, పనుల కోసం ప్రయాణించే క్రమంలోనూ ప్రమాదాలకు గురై మృతి చెందుతున్నారని దీంతో ఆయా కుటుంబాలు తీవ్ర కష్టాల్లో కూరుకుపోతున్నాయని చెప్పారు. ఇలాంటి సందర్భాల్లో కార్మికులు, వారి కుటుంబాలకు అండగా ఉండేందుకు 1995లో వచ్చిన కేంద్ర చట్టం ఆధారంగా రాష్ట్రంలో 2006లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటైందని వివరించారు. 29 రంగాలను ఇందులో కార్మికులుగా గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేశారని, ప్రమాద బీమా, పిల్లల చదువులు, పెళ్లిళ్లకు ఆర్థిక సాయం, వృద్ధాప్య పింఛను వంటి వాటిని అమలు చేశారని చెప్పారు. అయితే 2019లో ఈ సంక్షేమ బోర్డును వైసిపి ప్రభుత్వం ఎత్తివేసిందని, బోర్డుకు సెస్ ద్వారా సమకూరిన రూ.30 కోట్లను ఇతర పథకాలకు మళ్లించిందని తెలిపారు. దీనిపై కార్మికులు అప్పట్లో పెద్దఎత్తున ఉద్యమించగా చంద్రబాబు మద్దతిచ్చారని, తాము అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డును పునరుద్ధరణతోపాటు నిధుల్ని తిరిగిస్తామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. అయితే ఇప్పటికీ హామీని నెరవేర్చలేదని, పైగా బోర్డుకు సంబంధించిన మరో రూ.8 కోట్లనూ ఇతర పథకాలకు వాడుకుందని విమర్శించారు. వందల సంఖ్యలో కార్మికుల క్లెయిములు అపరిష్కృతంగా ఉన్నాయని, ప్రమాదాల బారినపడ్డ కార్మికులు ఇళ్లకే పరిమితమై తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటిపై కూటమి ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాలు తప్పవన్నారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ వద్ద 6వ తేదీన చేపట్టే ధర్నాలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, కార్పెంటర్ కార్యదర్శి ఎస్.కె.రఫీ, రాంబాబు, ఎలక్ట్రికల్ సంఘం నాయకులు ఎం.రమేష్, ఎస్కే వలి, పెయింటింగ్ సంఘం నాయకులు యేసుపాదం, సిఐటియు మండల కన్వీనర్ బి.సూరిబాబు, టి.సూరిబాబు పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని రక్షించాలని రాష్ట్రపతికి రైతుల లేఖ


యడ్లపాడు : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 10: భారత వ్యవసాయం మరియు చిన్న ఉత్పత్తిదారులను నాశనం చేసే అమెరికా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయవద్దని ప్రధాని నరేంద్ర మోడీని ఆదేశించాలని, బహుళజాతి సంస్థల దోపిడీకి వ్యవసాయ రంగాన్ని తెరవడం ద్వారా దేశ స్వావలంబన, సార్వభౌమాధికారాన్ని ప్రమాదంలోకి నెట్టిన కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌ను పదవి నుండి తొలగించాలని రాష్ట్రపతికి సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్‌కెఎం) డిమాండ్ చేసింది. ఎస్‌కెఎం పిలుపు మేరకు మండలంలోని ఏడు గ్రామాల్లో రైతుల సంతకాలను రైతుసంఘం ఆధ్వర్యంలో సేకరించి లేఖను రాష్ట్రపతికి స్థానిక పోస్టాఫీసులో సోమవారం పోస్టు చేశారు.

# 'బలమైన' హామీ సాకారానికి లోకేష్ భూమి పూజ!

**హైదరాబాద్ పెన్ పవర్:** గత ఎన్నికలకు ముందు మంగళగిరి నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీలను మంత్రి నారా లోకేష్ నెరవేరుస్తున్నారు. తాజాగా గత ఎన్నికల సమయంలో ఇక్కడి నదీతీర ప్రాంతం వాసుల సమస్యలు పరిష్కరించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని చెప్పారు. దీనికి సంబంధించి తాజాగా భూమి పూజ చేయడం గమనార్హం. తాడేపల్లి రిటైనింగ్ వాల్‌కు శంకుస్థాపన చేయడంతో స్థానికంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ రక్షణ గోడ నిర్మాణానికి 294 కోట్ల రూపాయలు ఖర్చుచేయనున్నారు. మంగళగిరి నియోజకవర్గం పరిధిలోని తాడేపల్లిలో ప్రకాశం బ్యారేజీ దిగువన రెండున్నర కిలో మీటర్ల మేరకు కృష్ణా నది కుడివైపున ఈ వరద రక్షణ గోడను నిర్మించనున్నారు. ఇది ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి లోకేష్ పెద్దపీట వేసినట్టు అయింది. దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న ఈ ప్రాజెక్ట్ కు కేవలం ఏడాది కాలంలోనే 294 కోట్ల రూపాయల పరిపాలన అనుమతులు సాధించడమే కాకుండా టెండర్ ప్రక్రియను కూడా పూర్తిచేశారు. భవిష్యత్ లో భారీ వరదలను దృష్టిలో పెట్టుకుని 15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని తట్టుకునేలా పటిష్టమైన డిజైన్ తో రిటైనింగ్ వాల్ ను నిర్మించనున్నారు.

**బలమైన కట్టడం!**

కేవలం సాధారణ గోడగా కాకుండా భూమి లోపల 26 నుంచి 38 మీటర్ల లోతు వరకు 1,920 పైల్స్ వేసి, పైల్- రాఫ్ట్ సాంకేతికతతో భూకంపాలను, నీటి ఉధృతిని తట్టుకునేలా నిర్మించనున్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తైతే సుందరయ్య నగర్, మహానాడు కాలనీ వంటి లోతట్టు ప్రాంతాల్లో నివసించే దాదాపు 50 వేల మంది ప్రజలు వరద భయం నుంచి శాశ్వతంగా విముక్తి పొందుతారు. అమరావతి రాజధాని పరిధిలోని కీలక ప్రాంతాలకు, జాతీయ రహదారి-65కు రక్షణగా రిటైనింగ్ వాల్ నిలవనుంది.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఇరాన్-ఇజ్రాయిల్ వార్ : ఏపీ ఎగుమతిదారులకు లాస్, ఎలా అంటే?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయల్ కొనసాగిస్తున్న యుద్ధంతో ఏపీ రైతులు కుదేలవుతున్నారు. యుద్ధం కారణంగా పశ్చిమాసియాకు ఎగుమతి కావాల్సిన ఆహారోత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు చెబుతున్నారు. ఒక్క ఏపీ మాత్రమే కాకుండా తెలంగాణ, హరియాణా, కర్ణాటక, పంజాబ్, మహారాష్ట్రకు చెందిన రైతులు కూడా నష్టపోతున్నారని మార్కెట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ నుంచి రొయ్యలు, బియ్యం పెద్ద ఎత్తున పశ్చిమాసియాకు ఎగుమతి చేస్తుంటారు. అదేవిధంగా పండ్లు, కూరగాయలు, చేపలు, మాంసం ఉత్పత్తులు సైతం ఆయా రాష్ట్రాల నుంచి ఎగుమతి అవుతుంటాయి. యుద్ధంతో హోర్ముజ్ జలసంధి మూసివేయడంతో పోర్టుల్లో సరుకు పేరుకుపోయిందని అంటున్నారు. మన దేశ మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో ఐదు వంతు పశ్చిమాసియా దేశాలకు వెళుతోందని చెబుతున్నారు. గత ఏడాది పశ్చిమాసియా దేశాలకు భారత్ నుంచి ఒక లక్షా 8 వేల 898 కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. ఇందులో దాదాపు 40 వేల కోట్ల రూపాయల విలువైన బియ్యం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఎగుమతి చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. హార్మోజ్ జలసంధి మూసివేయడంతో ఆ మార్గం గుండా సరుకు రవాణా చేసే నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మన దేశంలోని పోర్టుల్లో 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం నిల్వలు పేరుకుపోయినట్లు చెబుతున్నారు. ముఖ్యంగా కొన్ని నౌకలు నడి సంద్రంలో ఉండిపోయాయి. యుద్ధం మరికొంతకాలం కొనసాగితే నౌకల్లో ఉన్న రొయ్యలు, చేపలు, మాంసం ఉత్పత్తులు పాడయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మనం ఉత్పత్తి చేసే బాస్మతి బియ్యం ఎక్కువగా సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్ దేశాలు కొనుగోలు చేస్తున్నాయి. యుద్ధం వల్ల ఆ దేశాలకు బాస్మతి బియ్యం ఎగుమతి సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ప్రత్యామ్నాయ మార్కెట్లకు ఆ సరుకును తరలించే అవకాశం కనిపించడం లేదు. దీంతో స్థానికంగా ధరలు పతనమయ్యే ప్రమాదంతోపాటు రైతులకు కనీసం పంట ఉత్పత్తికి అయ్యే ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యుద్ధం వల్ల మన దేశం నుంచి దుబాయ్, ఇతర అరబ్ దేశాలకు ఎగుమతి అయ్యే పండ్లు, మాంసం ఉత్పత్తులు, గుడ్లు, పాలు వంటి ఎగుమతులు నిలిచిపోయాయని అంటున్నారు. యుద్ధం ప్రారంభం కాకముందు నుంచే ఉద్రిక్తతల కారణంగా ఎగుమతులు 50 శాతం క్షీణించాయి. యుద్ధం మొదలైన తర్వాత ఇవి పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పండ్లు, గుడ్లు, మాంసం ఉత్పత్తుల ధరలు పతనమయ్యే పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన వ్యక్తమవుతోంది.

**రంజాన్ వేళ.. ఎగుమతుల్లో స్తబ్దత**

మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న మాంసం, రొయ్యలు, పండ్లు, కూరగాయలు గల్ఫ్ దేశాలకు నిలిచిపోయాయి. దీంతో ఆయా దేశాల్లో రంజాన్ వేళ స్టాక్ తగ్గిపోయి స్తబ్ధత ఏర్పడిందని అంటున్నారు. రంజాన్ సమయంలో ఇఫ్తార్ విందులో భాగంగా ఎక్కువగా మాంసం, పండ్లు వినియోగిస్తారు. యుద్ధం కారణంగా ముస్లిం దేశాలు అయిన ఓమన్, కువైట్, సౌదీ, దుబాయ్ వంటి దేశాల నుంచి ఆర్డర్లు లేవని, నౌకలు కూడా అటువైపు వెళ్లడం లేదని చెబుతున్నారు. ఇదేసమయంలో పోర్టుల్లో నిలిచిపోయిన నౌకలు డెమరేజ్ చార్జిల భారం తడిపిమోపెడు అవుతోందని ఆవేదన చెందుతున్నారు. దీంతో ఎడాపెడా నష్టాలు ఎదురవుతున్నాయని స్థానికంగా రైతులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## హీరో శివాజీ.. అవసరమా ఈ మాటలు?

**హైదరాబాద్ పెన్ పవర్:** స్క్రిప్ట్ ప్రకారం అయితే ఆయనకు ఇప్పుడు కావాల్సింది మంచి పాత్రలు, హిట్ సినిమాలు... కానీ కెమెరా ముందు నటన కన్నా కెమెరా వెనుక రాజకీయ విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లున్నారు నటుడు శివాజీ. సినిమాలో విలన్‌ని ఎదుర్కోవడం ఎంత బాగుంటుందో రాజకీయాల్లోకి వెళ్లకుండానే విలనిజాన్ని ఎంచుకోవడం అంతకంటే రిస్క్ అని ఈయన ఎప్పుడు గుర్తిస్తారో! తెలుగు సినీ పరిశ్రమలో తనదైన శైలి నటనతో సహజమైన డైలాగ్ డెలివరీతో ఒకప్పుడు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు శివాజీ. సుదీర్ఘ విరామం తర్వాత 'బిగ్ బాస్' వంటి కార్యక్రమాల ద్వారా మళ్లీ పాపులర్ అయిన ఆయన ఇప్పుడు సినిమాల్లో కూడా బిజీ అవుతున్నారు. అయితే ఒక నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్న శివాజీ.. ప్రస్తుతం తెరపై కంటే తెర వెనుక రాజకీయ చర్చల వల్లనే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై ఆయన చేస్తున్న సంచలన వ్యాఖ్యలు, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఉద్దేశించి ఆయన చేస్తున్న విమర్శలు ఇప్పుడు సినీ, రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తున్నాయి.

**రాజకీయ నిష్పాక్షపాతం.. ఆచరణలో ప్రశ్నార్థకం?**

శివాజీ తాను ఏ రాజకీయ పార్టీకి చెందినవాడిని కాదని.. తనకు ఏ పార్టీతోనూ అంటకాగాల్సిన అవసరం లేదని పదే పదే చెబుతుంటారు. కానీ ఆయన మాటలు మాత్రం పరోక్షంగా ఒక నిర్దిష్ట రాజకీయ పక్షానికి... అంటే తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఉన్నాయనే భావన రాజకీయ పరిశీలకుల్లో బలంగా వ్యక్తమవుతోంది. ఒక నటుడిగా ప్రజా సమస్యల మీద స్పందించడం తప్పు కాదు... కానీ తన మాటలు రాజకీయంగా ఒక పక్షానికి అనుకూలంగా, మరొక పక్షానికి వ్యతిరేకంగా ఉండటం వల్ల ఆయన 'నిష్పాక్షపాతం'పై అనుమానాలు మొదలయ్యాయి. ఒకరిని విమర్శించడం, సవాళ్లు విసరడం వంటివి ఆయన ఇమేజ్‌ను ఒక 'పొలిటికల్ యాక్టివిస్ట్' స్థాయికి తీసుకువెళ్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

**రెండో ఇన్నింగ్స్.. సినిమాలపైనే దృష్టి పెట్టాల్సిన సమయం**

ప్రస్తుతం శివాజీకి నటుడిగా మంచి అవకాశాలు వస్తున్నాయి. క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కీలక పాత్రల్లో ఆయన తన ప్రతిభను చాటుకుంటున్నారు. ప్రేక్షకుల్లో కూడా ఆయనపై ఒక సానుకూల దృక్పథం పెరుగుతోంది. ఇలాంటి కీలక తరుణంలో సినిమాలపై, తన నటనపై పూర్తి దృష్టి పెట్టాల్సిన శివాజీ అనవసరమైన రాజకీయ వివాదాల్లో తలదూర్చడం వల్ల కలిగే లాభం ఏమిటనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. రాజకీయ వ్యాఖ్యల వల్ల ఆయనకు లభించే క్రేజ్ తాత్కాలికం కావచ్చు కానీ ఒక నటుడిగా ఆయనకు వచ్చే గుర్తింపు చిరస్థాయిగా ఉంటుంది. వివాదాలు నటుడిని నటుడిగా కాకుండా ఒక వర్గానికి ప్రతినిధిగా చూసే ప్రమాదం ఉంది. ఇది ఆయన సినీ కెరీర్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు సినీ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**సోషల్ మీడియా హోరు..వాస్తవ పరిస్థితి ఏమిటి?**

నేటి కాలంలో సోషల్ మీడియాలో ఏ చిన్న వ్యాఖ్య చేసినా దానికి అనంతమైన ప్రతిస్పందనలు వస్తుంటాయి. శివాజీ రాజకీయ వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో కొన్ని వర్గాల నుంచి భారీ మద్దతు లభిస్తోంది. అయితే ఈ మద్దతు ఇచ్చేది నిజమైన అభిమానులా లేక రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసే వర్గాలా అన్నది అంతుచిక్కని ప్రశ్న. ఇలా సోషల్ మీడియాలో పరస్పర విమర్శలు, రెచ్చగొట్టుకోవడం వల్ల సామాజికంగా లేదా రాజకీయంగా ఎటువంటి ప్రయోజనం చేకూరదని చివరికి ప్రత్యర్థులకు అనవసరమైన పబ్లిసిటీని కట్టబెట్టడమే అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**కెరీర్‌పైనే మక్కువ చూపితేనే మంచిది!**

ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తికి తమ అభిప్రాయాలను వెల్లడించే హక్కు ఉంది. అయితే ఒక బాధ్యతాయుతమైన నటుడిగా, లక్షలాది మంది అభిమానులు ఉన్న వ్యక్తిగా శివాజీ తన వ్యాఖ్యల వల్ల కలిగే పరిణామాలను ఆలోచించుకోవాలి. రాజకీయాల్లోకి వెళ్లకపోయినా రాజకీయ వ్యాఖ్యలు చేయడం వల్ల వచ్చే వివాదాలు కెరీర్‌ను దెబ్బతీస్తాయి. ఇప్పటికైనా ఆయన రాజకీయ వివాదాలకు దూరంగా ఉండి.. తన నటనతో ప్రేక్షకులను అలరించడంపైనే దృష్టి సారిస్తే బాగుంటుందనేది మెజారిటీ అభిమానుల ఆకాంక్ష. నటుడిగా ఆయనకు ఉన్న సహజమైన ప్రతిభ, ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణ ఆయనకు మంచి భవిష్యత్తును అందిస్తాయి. శివాజీ తన కెరీర్ పట్ల మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తారనేది అందరి ఆశ.

## ఇది ఏపీ పోలీసు రివేంజ్? బిహార్ లో దెబ్బకు రిటర్న్ గిఫ్ట్?

**హైదరాబాద్ పెన్ పవర్:** డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో బిహార్ కేడర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ విచారణపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. హైకోర్టు సూచనల ప్రకారం సునీల్ నాయక్ ను గత ఐదు రోజులుగా విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక పోలీసు అధికారుల బృందం విచారిస్తోంది. అంతేకాకుండా విచారణను మరో మూడు రోజులు పొడిగించింది. దీంతో బిహార్ లో ఎదురైన అవమానానికి రివేంజ్ తీర్చుకునేలా, రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేలా సిట్ పోలీసులు సునీల్ నాయక్ విచారణను కొనసాగిస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. బిహార్ లో సునీల్ నాయక్ ను అరెస్టు చేసేందుకు వెళ్లిన ఏపీ పోలీసు బృందానికి అక్కడ హోంగార్డులు ఇబ్బందులు సృష్టించారని, ఘర్షణ వైఖరి అవలంబించి కస్టడీలో ఉన్న సునీల్ నాయక్ ను తమతో తీసుకువెళ్లిపోయారని చెబుతున్నారు. అంతేకాకుండా ఓ మహిళా అధికారి ఇష్టానుసారం తిట్టారన్న ప్రచారం జరిగింది. దీనిపై రివేంజ్ తీర్చుకునేలా ప్రస్తుతం సునీల్ నాయక్ విచారణ కొనసాగుతోందా? అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. పోలీసు విచారణను పరిశీలిస్తే గతంలో సిట్ అధికారులు ఎదుర్కొన్న పరాభవానికి ఇప్పుడు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేలా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సునీల్ నాయక్ ను అరెస్టు చేయాలనే పట్టుదల పోలీసు అధికారుల్లో కనిపిస్తోందని, అందుకే బెయిలు తీర్పు వచ్చే వరకు విచారణను పొడిగిస్తూ వస్తున్నారని న్యాయవాద వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రఘురామరాజు అరెస్టు సమయంలో సునీల్ నాయక్ డీఐజీగా ఉన్నారు. అప్పట్లో ఏం జరిగింది? సునీల్ నాయక్ కు ఏం తెలుసు అన్న విషయాలపై సుదీర్ఘంగా విచారణ జరుగుతోంది. అయితే ఇదే కేసులో నిందితుడు అయిన మరో సీనియర్ అధికారి పీ.వీ.సునీల్ కుమార్ ను



కేవలం ఒక రోజు, అది కూడా కేవలం నాలుగు గంటల పాటు విచారించి వదిలేశారని గుర్తు చేస్తున్నారు. కానీ ఐపీఎస్ సునీల్ నాయక్ విషయంలో మాత్రం సిట్ పోలీసులు రోజుల తరబడి విచారణ కొనసాగించడమే ఇంట్రెస్టింగు డిస్కషన్ కు తెరతీస్తోంది. ఆయన వ్యవహారశైలిపై ఏపీ పోలీసు అధికారులు గుర్రుగా ఉన్నారని, అందుకే విచారణను సుదీర్ఘంగా కొనసాగిస్తూ తమ చుట్టూ సునీల్ నాయక్ తిరిగేలా చేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. బిహార్ రాజధాని పట్నాలో సునీల్ నాయక్ ను గతంలో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. అయితే నిబంధనలను చూపి ట్రాన్సిట్ వారెంట్ జారీ కాకుండా అక్కడి పోలీసులు సునీల్ నాయక్ ను ఏపీ తరలించకుండా అడ్డుకున్నారు. అంతేకాకుండా ఆ సమయంలో ఏపీ పోలీసులపై ఎదురు కేసులు పెట్టడం, ఒకానొక సమయంలో దాడికి ప్రయత్నించినట్లు ప్రచారం జరిగింది. దీనిని స్థానిక కోర్టు దృష్టికి తీసుకువెళ్లిన పోలీసులు సునీల్ నాయక్ ను విచారించేందుకు అనుమతి తీసుకున్నారు. దీంతో ఈ నెల 5వ తేదీ నుంచి ఆయన రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుంటూరు సీసీఎస్ పోలీసుస్టేషన్ లో విచారణకు హాజరవుతున్నారు. తొలుత 9వ తేదీవరకు సునీల్ నాయక్ విచారణకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఆయన విచారణకు సహకరించడం లేదని కోర్టు దృష్టికి తీసుకువెళ్లడంతో మరో మూడు రోజులు సిట్ ఎదుట హాజరు కావాలని కోర్టు సూచించింది. దీంతో ఈ నెల 12వ తేదీ వరకు సునీల్ నాయక్ విచారణ కొనసాగుతుందని చెబుతున్నారు. ఇదంతా పరిశీలిస్తే గతంలో విచారణకు హాజరుకాకపోవడం, బిహార్ లో తమకు సహకరించకపోవడాన్ని సిట్ పోలీసులు సీరియస్ గా తీసుకున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కారణంగానే సీనియర్ అధికారిని విచారణ పేరుతో రోజూ తమ వద్దకు రప్పించుకుంటున్నారని అంటున్నారు. సునీల్ నాయక్ ముందస్తు బెయిలుపై హైకోర్టు తీర్పు వచ్చేవరకు ఈ పరిస్థితి కొనసాగుతుందని అభిప్రాయపడుతున్నారు. హైకోర్టులో సునీల్ నాయక్ ముందస్తు బెయిలుపై తీర్పు వచ్చిన తర్వాత అరెస్టు చేయాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుని విచారణ ముగిస్తారని అంటున్నారు. దీంతో మరో రెండు రోజులు కూడా సునీల్ నాయక్ విచారణ కొనసాగుతుందని, 12వ తేదీన హైకోర్టు ఆదేశాలతో ఈ పరిస్థితిలో మార్పు రావొచ్చని అంటున్నారు.

## పశ్చిమ ప్రకాశం లో వైసీపీ వీక్ అయిందా ?

**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీకి భారీ ఓటమి బాధలు ఇంకా తీరలేదా అన్న చర్చ నడుస్తోంది. ఎందుకంటే ఆ పార్టీకి కీలకమైన జిల్లాలలో ఇంకా కోలుకోకపోవడమే అని అంటున్నారు. ఇక జగన్ అంటేనే పశ్చిమ ప్రకాశంగా చెబుతారు. అలాగే పశ్చిమ ప్రకాశం అంటే జగన్ అనే విధంగా అక్కడ రాజకీయం ఉంటుంది. అలాంటి పశ్చిమ ప్రకాశంలో ఇపుడు వైసీపీ రాజకీయాలు భిన్నంగా సాగుతున్నాయని అంటున్నారు. పశ్చిమ ప్రకాశం మార్కాపురం జిల్లాగా మారింది. మొత్తం నాలుగు నియోజకవర్గాలు ఈ జిల్లాలో ఉన్నాయి. ఇక ఇందులో మూడు జనరల్ ఓసీ అయితే ఒకటి ఎస్సీగా ఉంది. అదే ఎర్రగొండపాలెం. ఇక మిగిలినవి చూస్తే మార్కాపురం, గిద్దలూరు, కనిగిరిగా ఉన్నాయి.

**వారిదే డామినేషన్ :**

ఇక చూస్తే పశ్చిమ ప్రకాశంలో రెడ్డి సామాజిక వర్గానిదే డామినేషన్ అంటారు. అంటే జనాభా పరంగా వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కానీ ఇక్కడ జగన్ అమలు చేస్తున్న స్ట్రాటజీ అయితే ఏ మాత్రం వర్కౌట్ కావడంలేదు అని అంటున్నారు. కనిగిరిలో పూర్తిగా రెడ్లు ఉంటారు. కానీ అక్కడ సీటు యాదవ సామాజిక వర్గానికి జగన్ ఇచ్చారు. టీడీపీ తరఫున రెడ్డి అభ్యర్థి ఉన్నారు. దాంతో సామాజిక వర్గం సమీకరణలతో రెడ్డికే అంతా జై కొట్టారు. అయితే ఇక్కడ యాదవ సామాజిక వర్గం కూడా మూడవ ప్లేస్ లో ఉంది. అయితే ఇక్కడ ఓటర్లలో కానీ మార్కాపుపురంలో కానీ పూర్తిగా రెడ్లే ఉంటారు. అలాగే అక్కడ వైశ్య సామాజిక వర్గానికి సీటు ఇస్తే టీడీపీ రెడ్లకు ఇచ్చింది. దాంతో అక్కడ కూడా వైసీపీ వ్యూహమేదీ వర్కౌట్ కాలేదని చెబుతారు

**సీన్ మొత్తం అంతే :**

ఇక చూస్తే గిద్దలూరులో నాన్ లోకల్ ని వైసీపీ హైకమాండ్ ఇంచార్జి ఇచ్చారు. కానీ రెడ్డి సామాజిక వర్గమంతా సబ్ క్యాస్ట్ ఆ అభ్యర్థికి లేవు. కానీ అక్కడ అంతా సబ్ క్యాస్ట్ కే మొదటి ప్రాధాన్యత ఇస్తారు. అలా గిద్దలూర్లో అయితే ఆ పార్టీ ఇంచార్జి అసలు గ్రామ కమిటీలు కూడా వేయలేకపోతున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. దాంతో ఇంకా చాలా గ్రామాలు ఖాళీగా ఏ కమిటీలు లేకుండా ఉన్నాయని అంటున్నారు. ఇక ఆయన ఉండేది మార్కాపురంలో గిద్దలూరుకి చుట్టపు చూపుగా వస్తూ పోతూ ఉన్నారు అంటున్నారు. దాంతో గిద్దలూరులోని వైసీపీ క్యాడర్ అయితే ఇంచార్జిని నమ్మడం లేదని అంటున్నారు. దాంతో ఆయనకే 2029లో టికెట్ వస్తుందా లేదా అన్నది కూడా చాలా మంది అనుకుంటున్న నేపథ్యం ఉంది.

**పార్టీలోనే వ్యతిరేకత :**

ఇక మార్కాపురంలో అయితే ఇంచార్జికి గ్రామంలో ఉన్న



రెడ్డి సామాజిక వర్గం నాయకులకు అసలు సపోర్టు చేయడం లేదని అంటున్నారు. ఎందుకంటే గతంలో ఆ ఇంచార్జికి అక్కడి రెడ్డి సామాజిక వర్గం నేతలకు పడడం లేదని భావించే గిద్దలూరు నుంచి వచ్చి మార్కాపురంలో పోటీ చేశారు అని గుర్తు చేస్తున్నారు. అయితే అక్కడ మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు. వారి వర్గం కూడా బలంగా ఉంది. అందుకే ఆయనకు మద్దతు ఇవ్వవద్దని అని బహిరంగానే వైసీపీ నేతలు చెబుతున్నారని టాక్ నడుస్తోంది. దాంతో అక్కడ కూడా చాలా ఇబ్బందిగా ఉంది అని అంటున్నారు.

**కనిగిరిలోనూ ఇబ్బందిగానే :**

ఇక కనిగిరి నియోజకవర్గంలో అయితే గతంలో ఎమ్మెల్యేగా ఉన్న వారి వర్గీయులు ప్రస్తుతం ఇంచార్జికి ఏ మాత్రం మద్దతు ఇవ్వడం లేదు, పైగా బాహాటంగా వ్యతిరేకిస్తున్నారు. ఇంచార్జి తీరు పట్ల అక్కడ రెడ్డి సామాజిక వర్గం గుర్రుగా ఉనంటున్నారు అని చెబుతున్నారు. ఇక కనిగిరి ఇంచార్జికి డబ్బులు సమస్యగా ఉంది అని అంటున్నారు. ఇదే విషయం పెద్ద ఎత్తున డిస్కషన్ గా ఉంది. కనిగిరి ఒక్కటే కాదు మార్కాపురం, గిద్దలూరు ఇంచార్జిలు కూడా డబ్బులు తీయడం లేదు అని పార్టీలోనే కామెంట్స్ ఉన్నాయి.

**ఈయన ఒక్కడే బెస్ట్ :**

ఇక యెర్రగుండపాలెం ఎస్సీ ఎమ్మెల్యే మాత్రం బెస్ట్ అని అంటున్నారు. ఆయన అందరికీ నియోజకవర్గంలో కలుపుకుని పోతున్నారు అని చెబుతున్నారు. అందరితో మంచి సంబంధాలు నెరుపుతున్నారు అని నియోజకవర్గం క్యాడర్ ఎబుతోంది. ఇక వైసీపీ హైకమాండ్ కి ఆయన మీద మంచి నివేదికలు వెళ్ళాయని అంటున్నారు అలా యెర్రగొండపాలెం ఎమ్మెల్యేకు జగన్ దగ్గర మంచి మార్కులే పడుతున్నాయని అంటున్నారు. దాంతో అతనికి ఏ ఇబ్బంది ఉండదని వచ్చే ఎన్నికల్లో టికెట్ ఖాయమని అంటున్నారు.

**మూడు సీట్లూ ఫోకస్ పెట్టాల్సిందే :**

అయితే కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లలో మూడు అసెంబ్లీ సీట్ల మీద వైసీపీ అధినాయకత్వం ఫోకస్ పెట్టాల్సిందే అని అంటున్నారు. మార్కాపురం, కనిగిరి, గిద్దలూరూ ఈ మూడు సీట్లను బలమైన రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వాలని కోరుతున్నారు ఇంచార్జిలుగా ఉన్న వారు జనంతో ఉండాలని క్యాడర్ ని కలుపుకుని పోవాలని డబ్బులు ఖర్చు పెట్టాలని కోరుతున్నారు. లేకపోతే ఇబ్బంది అవుతుందని అంటున్నారు. ఈ ముగ్గురు ఇంచార్జిల పనితీరు మీద గుర్రుగా ఉన్న క్యాడర్ అయితే వారిని మార్చాలని తామే హైకమాండ్ ని కోరుతామని కూడా అంటున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఈ నియోజకవర్గాలలో కనుక మార్పులు చేసి బలమైన రెడ్లని ఇంచార్జులుగా నియమిస్తే వైసీపీకి తిరుగు ఉండదని అంటున్నారు. దాంతో మార్కాపురం జిల్లాలో నాలుగు అసెంబ్లీ సీట్లను వైసీపీ గెలుచుకుని తీరుతుందని వైసీపీ అంటున్నారు. మరి హై కమాండ్ ఈ విషయంలో ఏ రకమైన నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది అని అంతా చర్చిన్ చర్చించుకుంటున్నారు.

# వరల్డ్ కప్ ఫైనల్‌లో గొడవ.. అర్ష్‌దీప్ సింగ్‌కి షాక్ ఇచ్చిన ఐసీసీ



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా నంబర్--1 టీ20 బౌలర్ అర్షదీప్ సింగ్ పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ బిగ్ షాక్ ఇచ్చింది. పొట్టి ప్రపంచకప్ 2026 ఫైనల్లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ పట్ల ప్రవర్తించిన తీరుపై భారీగా ఫైన్ విధించింది. మ్యాచ్ ఫీజ్ లో 15 శాతం కోత పెట్టడంతో పాటు ఓ డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది. గత 24 నెలల్లో ఇదే ఫస్ట్ తప్పిదం కావడంతో అర్షదీప్ మ్యాచ్ నిషేధం ప్రమాదాన్ని తప్పించుకున్నాడు. పూర్తి వివరాల్లోకి వెళితే.. తాజాగా ముగిసిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో డారిల్ మిచెల్ పైకి అర్షదీప్ ప్రమాదకరంగా బంతిని విసిరాడు. ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్న ఐసీసీ అతడిపై కఠిన చర్యలు చేపట్టింది. వాస్తవానికి డారిల్ మిచెల్ పై అర్షదీప్ అంత సీరియస్ గా బంతిని విసరాల్సిన పని లేదు.. ఫాలో అప్ లో భాగంగా బాల్ ని వికెట్లపైకి విసరడంతో ప్రమాదవశాత్తు అది మిచెల్ కి గట్టిగా తాకింది. ఆ సమయంలో మిచెల్ సైతం సహనాన్ని కోల్పోవడంతో.. అర్షదీప్ అతన్ని పట్టించుకోకుండా తాను బౌలింగ్ చేసేందుకు వెళ్లిపోయాడు. దీంతో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సర్ది చెప్పడంతో ఆ గొడవ అంతటితో ఆగిపోయింది. ఈ ఘటన జరిగిన తర్వాత మిచెల్ కి క్షమాపణలు చెప్పిన అర్షదీప్ షేక్ హ్యాండ్ ఇచ్చి హగ్ చేస్తున్నారు.

ఇలాంటి ఘటనలు ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ లోని ఆర్టికల్ 2.9 రూల్స్ ఉల్లంఘన కిందికి వస్తాయి. దీని ప్రకారం, బంతి లేదా ఇతర క్రికెట్ సామగ్రిని మరో ప్లేయర్ వైపు అనుచితంగా లేదా ప్రమాదకరంగా విసరడం తప్పు.. ఇందుకు తగిన మూల్యాన్ని అర్షదీప్ చెల్లించుకున్నాడు. ఇక ప్రపంచకప్ ఫైనల్లో కివీస్ పై భారత్ 96 పరుగుల తేడాతో గెలిచి వరుసగా రెండో టీ20 వరల్డ్ కప్ ని సొంతం చేసుకుంది. మొత్తంగా ఐదో ప్రపంచకప్ లని టీమిండియా ఇప్పటి వరకు (1983, 2011 (వన్డే), 2007, 2024, 2026 (టీ20)) కైవసం చేసుకుంది.

# హార్దిక్ కుటుంబంలో చిచ్చు పెట్టిన మహికా శర్మ.. విడిపోతున్న పాండ్యా బ్రదర్స్..?



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా కుటుంబంలో అతడి గర్ల్ ఫ్రెండ్ మహికా శర్మ చిచ్చు పెట్టింది. ఇద్దర అన్నదమ్ముల ( హార్దిక్-- కృనాల్ పాండ్యా) మధ్య విభేదాలు వచ్చాయా అనే చర్చ ప్రస్తుతం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత అభిమానులు గమనించిన కొన్ని విషయాలు ఈ ఊహాగానాలకు బలం చేకూర్చుతున్నాయి. వరల్డ్ కప్ గెలిచిన తర్వాత దేశవ్యాప్తంగా సంబరాలు జరిగాయి.. ఈ టోర్నీలో హార్దిక్ పాండ్య కీలక పాత్ర పోషించాడు. ఈ విజయానికి సంబంధించిన పోస్టులు లేదా అభినందనలు అతని అన్న క్రునాల్, వదిన పంకురి శర్మ నుంచి నెట్టింట ఎక్కడ కనిపించకపోవడంతో ఫ్యాన్స్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, ఫైనల్ మ్యాచ్ లో కృనాల్ పాండ్యా, ఆయన భార్య స్టేడియంలో కనిపించకపోవడం ఈ చర్చకు మరింతగా వైరల్ అవుతుంది. దీంతో ఇద్దరు సోదరుల మధ్య ఏమైనా విభేదాలు వచ్చాయా అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొంతమంది ఫ్యాన్స్ అభిప్రాయం ప్రకారం.. హార్దిక్ పాండ్యా-- మోడల్ మహికా శర్మ మధ్య ఉన్న సన్నిహిత సంబంధం వల్లే ఈ పరిస్థితికి కారణమై ఉండొచ్చని పేర్కొంటున్నారు. 25 ఏళ్ల మహికా శర్మ టీ20 వరల్డ్ కప్ మొత్తం హార్దిక్‌తో కలిసి ప్రయాణిస్తుస్తూ స్టేడియంలో అతనికి సపోర్టు చేసింది. ముంబైలోని వాంఖెడే స్టేడియంలో ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ సమయంలో హార్దిక్ కుమారుడు అగస్త్య పాండ్య కూడా మహికాతో కలిసి మ్యాచ్‌ను వీక్షించాడు. హార్దిక్ 12 బంతుల్లో 27 పరుగులు చేసి అవుట్ కావడంతో అగస్త్య కొంత నిరాశకు గురైనట్లు కనిపించగా, మహికా అతన్ని ఓదార్చిన దృశ్యాలు కూడా నెట్టింట వైరల్ అయ్యాయి. ఫైనల్ లో గెలిచిన అనంతరం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో హార్దిక్-- మహికా రొమాన్స్ చేసుకోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. సోషల్ మీడియాలో ఈ విషయంపై ఫ్యాన్స్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇది కేవలం ఊహాగానం మాత్రమే అంటున్నారు. నెట్టింట పోస్టులు పెట్టకపోతే కుంటుంబంలో విభేదాలు ఉన్నాయని అనుకోవడం సరైంది కాదు.. ఫ్యామిలిలో చిన్న చిన్న మనస్పర్ధలు వస్తుంటాయని ఒక యూజర్ రాసుకొచ్చాడు. మరో వ్యక్తి ఇలా కామెంట్ పెట్టాడు.. హార్దిక్ గత ఏడాది నుంచి వేరుగా ఉంటున్నాడు.. మహికాతో జరిగిన ఎంగేజ్‌మెంట్‌కు కూడా కృనాల్‌ను ఆహ్వానించలేదని తెలుస్తుందని పేర్కొన్నాడు. అయితే ఒక ప్రేమ ఇద్దరి అన్నదమ్ముల మధ్య బంధాన్ని విడదీసిందని మరో నెటిజన్ కామెంట్ చేశాడు. అయితే, ఇప్పటి వరకు హార్దిక్ పాండ్యా గానీ కృనాల్ పాండ్యా కానీ ఈ విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దాంతో ప్రస్తుతం జరుగుతున్న చర్చ అంతా అభిమానుల ఊహాగానాలకే పరిమితమైంది.

# రెండ్రోజుల పాటు బాగా తిని, హాయిగా నిద్రపోతా: సూర్యకుమార్ యాదవ్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ వంటి మెగా టోర్నీని గెలిచిన తర్వాత మీ తదుపరి ప్రణాళిక ఏంటి? అని అడిగితే ఏ కెప్టెన్ అయినా తర్వాతి సిరీస్‌ల గురించో, భవిష్యత్ సవాళ్ల గురించో చెబుతారు. కానీ టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం చాలా సరదాగా, సింపుల్‌గా సమాధానమిచ్చాడు. "ప్రస్తుతానికి నా ప్లాన్ ఒక్కటే. ఇంటికి వెళ్లి, మంచి భోజనం చేసి, రెండ్రోజులు హాయిగా నిద్రపోవాలి. ఆ తర్వాతే మిగతా విషయాల గురించి ఆలోచిస్తా" అని తన తక్షణ కర్తవ్యాన్ని వెల్లడించాడు. స్వదేశంలో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో గెలిచి, ఈ ఘనత సాధించిన తొలి ఆతిథ్య జట్టుగా చరిత్ర సృష్టించిన ఆనందంలో ఉన్న సూర్య... ముంబైలోని తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడాడు. ఈ విజయం జట్టు సభ్యులదే కాదు, అభిమానులది కూడా అని అన్నాడు. "మీరంతా మాతో సమానంగా సంబరాలు చేసుకున్నారు. మీ అందరికీ అభినందనలు. భారత్‌లో ప్రపంచకప్ గెలవడం చాలా ప్రత్యేకమైన అనుభూతి. ఎంతో మంది మద్దతు, ప్రార్థనల వల్లే ఇది సాధ్యమైంది" అని తెలిపాడు. ఈ విజయం వెనుక మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ప్రోత్సాహం ఎంతో ఉందని సూర్య గుర్తు చేసుకున్నాడు. "2024లో రోహిత్ కెప్టెన్సీలోనే మేం టీ20 ప్రపంచకప్ గెలిచాం. ఆ తర్వాత అతడు కెప్టెన్సీ నుంచి తప్పుకున్నప్పుడు నాపై పూర్తి నమ్మకం ఉంచాడు. గత రెండేళ్లుగా ఈ జట్టును విజయవంతంగా నడిపించాను. ఇప్పుడు ప్రపంచకప్ కూడా గెలిచాం. నాపై రోహిత్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టడం చాలా ఆనందంగా ఉంది. ఈ విజయం యావత్ భారతదేశానిది" అని సూర్య వివరించాడు. టోర్నమెంట్‌కు ముందు రోహిత్ వ్యాఖ్యలను కూడా సూర్య పంచుకున్నాడు. "మీ జట్టు చాలా బాగుంది. ధైర్యంగా ఆడండి. గెలుపు మీదే అవుతుంది" అని రోహిత్ చెప్పిన మాటలు తమలో స్ఫూర్తి నింపాయని అన్నాడు.

ప్రస్తుత విజయంతోనే ఆగిపోమని, భవిష్యత్ లక్ష్యాలపై తమకు స్పష్టమైన ప్రణాళిక ఉందని సూర్య వెల్లడించాడు. "2028లో జరగనున్న ఒలింపిక్స్‌లో క్రికెట్ తరఫున దేశానికి స్వర్ణ పతకం అందించడమే మా తదుపరి లక్ష్యం. అదే ఏడాది మరో టీ20 ప్రపంచకప్ కూడా ఉంది. కాబట్టి హ్యాట్రిక్ ప్రపంచకప్‌లు గెలిచేందుకు మా వంతు కృషి చేస్తాం" అని ధీమా వ్యక్తం చేశాడు. ప్రపంచకప్ గెలిచిన రాత్రి జరిగిన సంబరాల గురించి చెబుతూ... "ఆ రాత్రి మేం ఏం చేశామో చెప్పాలనుంది కానీ... ఉదయం 8 గంటల వరకు మేల్కొనే ఉన్నాం. ఒక టీమ్‌గా గెలిచినప్పుడు సంబరాలు కూడా కలిసే చేసుకోవాలి. అందుకే మేమంతా కలిసే ఆనందాన్ని పంచుకున్నాం" అని సూర్య తెలిపాడు. వరుసగా రెండుసార్లు (2024, 2026) ఐసీసీ టోర్నీలు గెలవడంతో తమపై ఒత్తిడి ఉన్నప్పటికీ, సరైన సమయంలో రాణించామని సూర్య పేర్కొన్నాడు. ఒత్తిడి లేకపోతే ఆటలో మజా ఉండదని వ్యాఖ్యానించాడు. ముంబై చేరుకున్న తర్వాతే ప్రపంచకప్ గెలిచామనే అసలైన భావన కలుగుతోందని, ఈ ఆనందం చాలాకాలం పాటు తనతోనే ఉంటుందని చెప్పుకొచ్చాడు. తన క్రికెట్ ప్రయాణం మొదలైన ముంబైని ఎప్పటికీ వీడనని, తాను భారతీయుడిగా గర్విస్తున్నానని సూర్య పేర్కొన్నాడు.


# 'బేబీ' జంట కొత్త మూవీ.. ఫస్ట్ సింగిల్ విన్నారా?

టాలీవుడ్ యంగ్ క్యాస్టింగ్ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్ నుంచి రిలీజ్ అయిన ఫస్ట్ సింగిల్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సంచారమే అంటూ సాగుతున్న ఆ పాట మంచి రెస్పాన్స్ అందుకుంటూ.. సూపర్ మెలోడీగా మెప్పిస్తోంది. సినిమా కథలోని మెయిన్ రోల్స్ ఎమోషనల్ జర్నీని సాంగ్ క్లియర్ గా చూపిస్తోంది.


ఆ పాటకు ప్రముఖ కవి, రైటర్ గోరటి వెంకన్న లిరిక్స్ అందించగా.. ప్యూర్ తెలుగు పదాలు, హృదయాన్ని తాకే భావాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇండియన్ కల్చర్, ఫారిన్ లైఫ్ స్టైల్ మధ్య ఉండే తేడాలను సింపుల్ గా వ్యక్తపరుస్తూ సంచారమే పాట సాగుతుంది. సినిమా స్టోరీకి అనుగుణంగా, యూత్ మనసుల్లోని ఫీలింగ్స్ వ్యక్తపరిచేలా సాంగ్ ను రూపొందించినట్లు చిత్రబృందం తెలిపింది.



సంచారమే పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ బాణీలు కట్టారు. ఆయన కంపోజిషన్ సాంగ్ కు మరింత అందాన్ని తీసుకొచ్చింది అంతేకాకుండా హేషమ్ అబ్దుల్ వహాబ్, గోరటి వెంకన్న కలిసి సాంగ్ ను ఆలపించడం విశేషం. వారి వాయిస్ పాటలోని భావాన్ని ప్రేక్షకుల హృదయాలకు **చేరవేస్తుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు.**



అదే సమయంలో సాంగ్ విజువల్స్ పరంగా కూడా ఆకట్టుకుంటోంది. ఫారిన్ బ్యాక్ డ్రాప్ తో షూట్ చేసిన ఆ సాంగ్ లో లండన్ లోని ఫేమస్ స్పాట్స్ చూపించారు మేకర్స్. అక్కడి నేచుర్ సీన్స్, సిటీ వాతావరణం మధ్య తెలుగు పాటను చిత్రీకరించిన విధానం ప్రేక్షకులను ఆకర్షిస్తోంది. ఓవరాల్ గా సాంగ్ మ్యూజిక్ లవర్స్ ను ఆకట్టుకుని.. అనేక మంది ఫేవరెట్ లిస్ట్ లోకి చేరిపోయిందని చెప్పాలి. ఇక సినిమాలో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మరోసారి కలిసి నటిస్తున్నారు. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన బేబీ సినిమా మంచి విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రంతో ప్రేక్షకుల మనసుల్లో నిలిచిన జంట మళ్లీ కలిసి నటించడంతో కొత్త సినిమాపై ఆసక్తి పెరిగింది. ఇప్పుడు సాంగ్ లో వీరి మధ్య కనిపించే ఎమోషనల్ మూమెంట్స్, కెమిస్ట్రీ, స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకుంటున్నాయి. ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్ మూవీతో ఆదిత్య హాసన్ డైరెక్టర్ గా పరిచయమవుతున్నారు. ఇప్పటికే ఆయన తీసిన 90స్ వెబ్ సిరీస్ ఓ రేంజ్ లో మెప్పించగా.. ఇప్పుడు సిల్వర్ స్క్రీన్ పై లక్ ను టెస్ట్ చేసుకోనున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగ వంశీ, సాయి సౌజన్య సినిమాను నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ అజీమ్ మహమ్మద్ నిర్వహించగా, ఎడిటింగ్ బాధ్యతలు నవీన్ నూలి చేపట్టారు. మరి స్మూత్ లవ్ స్టోరీతో రూపొందుతున్న ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్ ఎప్పుడు రిలీజ్ అవుతుందో, ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965